www.akshratimes.com

తెలుగు దినపత్రిక

# అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211

సంపుటి : 04 సంచిక : 73 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com మంగళవారం 30 - 06 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



బాబోయ్ పాములు.. హైదరాబాద్ లో పెరిగిన విషసర్పాల బెడద!



## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం

- ఏపీ హోంమంత్రి అనిత
- ఆస్తులు జప్తు చేశాం
- గంజాయి సాగును రికార్డు స్థాయిలో సున్నాకు చేర్చామన్న అనిత
- దీని కారణంగా క్రైమ్ రేటు 14 శాతం తగ్గిందని వెల్లడి
- ఈగిల్ వింగ్ అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని కితాబు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగును రికార్డు స్థాయిలో దాదాపు సున్నాకు చేర్చామని, దీని కారణంగా ఏపీలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఏపీ హోంమంత్రి - మిగతా 2 లో

# అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి
- అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం
- రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి
- ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు
- అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలని సూచన



**అమరావతి :** దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు - మిగతా 2 లో

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి



- రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్
- షైనింగ్ స్టార్లే ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి లోకేశ్
- వచ్చే ఏడాది ప్రైవేటు నుంచి 2 లక్షల మందిని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యం
- విద్యార్థుల కోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టామని వెల్లడి
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట సత్కారం

**అమరావతి :** వచ్చే ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి కనీసం రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరాలన్నదే తన లక్ష్యమని, ఈ మార్పునకు 'షైనింగ్ స్టార్లే' బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ విద్యా నమూనా గురించే మాట్లాడుకోవాలని ఆకాంక్షించారు. గత సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'షైని ంగ్ స్టార్స్' పేరుతో ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో టెన్త్ టాపర్లు - మిగతా 2 లో

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

- ఖమేనీ అంత్యక్రియలకు భారత్ ప్రతినిధులు
- జులై 4న ఖమేనీ అంత్యక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- భారత్ తరఫున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి



**ఢిల్లీ :** ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల - మిగతా 2 లో




## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం

- టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు
- హర్మూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి

## ఒకవైపు శాంతి మంత్రం మరోవైపు రక్తపాతం!

- ఆఫ్ఘనిస్థాన్‌లోని మూడు జిల్లాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు
- వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహంతో దాడిలో 35 మంది మృతి
- ఉగ్రవాద స్థావరాలపైనే దాడులని పాక్ వాదన
- పౌరులు మరణించారని ఆఫ్ఘన్ ఆరోపణ



**ఢిల్లీ :** అంతర్జాతీయ వేదికపై అమెరికా, ఇరాన్ మధ్య శాంతిని నెలకొల్పేందుకు మధ్యవర్తిత్వం వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్న పాకిస్థాన్, సొంత సరిహద్దుల్లో మాత్రం భీకర దాడులకు పాల్పడుతోంది. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో పాక్ సైన్యం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 35 మంది మరణించారు. - మిగతా 2 లో



## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

- ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే
- రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే
- ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

**ఢిల్లీ :** రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి - మిగతా 2 లో

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

- జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క
- కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య
- పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



**హైదరాబాద్ :** వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర - మిగతా 2 లో

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

- 'ఢిల్లీ ఈవీ పాలసీ 2026'కు ఢిల్లీ కేబినెట్ ఆమోదం
- వినియోగదారులకు రూ.15,000 కోట్ల మేర ప్రయోజనాలు కల్పన
- ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు
- జూలై 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం




**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఢిల్లీ ఈవీ పాలసీ 2026"కు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ కొత్త విధానం - మిగతా 2 లో

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు




- భారీ వర్షాల కారణంగా మధిర సభ రద్దు
- సీఎం రేవంత్ సభను హైదరాబాద్‌కు మార్చిన ప్రభుత్వం
- శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం
- రైతు వేదికల నుంచి వర్చువల్‌గా రైతుల భాగస్వామ్యం



## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- వాటితోనే రేవంత్ గెలిచారా?
- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత

# నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

- తొలివిడతలో 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్న మంత్రి తుమ్మల
- నేడు 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తామన్న మంత్రి
- దశలవారీగా నిధులు జమ




**హైదరాబాద్ :** రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతల ఖాతాల్లో దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు.రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో రైతు ఆశీర్వద సభను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్ చేసింది. అయితే ఖమ్మంలో కురిసిన భారీ వర్షానికి ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా,కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను రద్దు చేసింది.రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం ఆదేశించారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నేడు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతావారికి

# సంపాదకీయం

## 'గుర్తింపు' బాధలు!



భారత ప్రభుత్వం జారీచేసిన పాస్‌పోర్టు ఉన్నంతమాత్రాన భారతీయ పౌరులు కాబోరని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన పెద్ద దుమారం రేపింది. మాధ్యమాల్లో తీవ్రచర్చోపచర్చలకు తోడుగా సోషల్ మీడియాలో జోకుల వర్షం కురుస్తోంది. ఇంతోటిదానికీ, పాస్‌పోర్టు జారీకి సంక్లిష్టమైన ప్రక్రియలూ పోలీసు వెరిఫికేషన్లతో ప్రజలను వేధించడం ఎందుకని కొందరు ఎగతాళి చేస్తున్నారు. పైగా, పాస్‌పోర్టు సేవాదివస్ సందర్భంగా కేంద్ర విదేశాంగశాఖ ఈ వ్యాఖ్యలు చేస్తూ, అది కేవలం విదేశీప్రయాణాలకు వీలుకల్పించే అనుమతిపత్రమే తప్ప, అది ఉన్నంతమాత్రాన ఈ దేశ పౌరసత్వం వచ్చేసినట్టు కాదని వ్యాఖ్యానించి మరీ వివాదం రేపింది. భారతీయ పౌరసత్వానికి ఇప్పుడు ఏకైక రుజువు హిందువు కావడమా అని ఒకరు ప్రశ్నిస్తే, బీజేపీ ఓటరైతే పౌరుడేనని మరొకరన్నారు. ఇంతకాలమూ నా దగ్గర ఆధార్ ఉన్నా, ఓటరు కార్డున్నా నేను పౌరుడిని కాదు పొమ్మన్నారు, ఇప్పుడు పాస్‌పోర్టును కూడా ఆ జాబితాలో చేర్చారు, పుట్టుకనుంచి చావు వరకూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న అన్నేసి పత్రాల్లో ఏ ఒక్కటైనా నన్ను ఈ దేశపౌరుడుగా గుర్తిస్తుందా? అని ఒక జర్నలిస్టు సోషల్ మీడియాలో వాపోయారు. ఈ దేశపౌరులు గుర్తింపు సంక్షోభంలో ఉన్నారన్న వ్యాఖ్య ఈ పరిస్థితికి చక్కగా అతుకుతుంది. ఓటరు కార్డు మంజూరు చేసిన ఎన్నికల సంఘం అది గుర్తింపు కార్డు మాత్రమేనని తీసిపారేసింది. ప్రభుత్వం అన్నింటికీ ఆధార్‌నే ఆధారం చేసినప్పటికీ, అది కూడా పౌరసత్వానికి రుజువు కాదన్నది. జననం, శాశ్వత నివాసం అనే రెండు మూలాధార పత్రాలతో సహా సవాలక్ష రుజువులు చూపితే కానీ మంజూరు కాని పాస్‌పోర్టు సైతం ఇప్పుడు ఆ జాబితాలో చేరడం పౌరసమాజానికి ఆగ్రహం కలిగిస్తోంది. పాస్‌పోర్టు కేవలం విదేశీ ప్రయాణపత్రం అయితే, అక్కడి పౌరసత్వం తీసుకున్నవారు ఇక్కడ దానిని తిరిగి వెనక్కు ఇచ్చేయాలన్న నిబంధన ఎందుకు ఉన్నట్టు? ఒకరి పాస్‌పోర్టు రద్దయినా, నిషేధించినా, దానిని ఉపసంహరించుకున్నా అది ప్రభుత్వానిది అయిపోయినట్లేనని నిబంధనల్లో అంత ప్రత్యేకించి ఎందుకు రాసినట్టు? ఇత్యాది ప్రశ్నలు అనేకం వింటున్నాం. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలవుతున్నా, ఎవరు భారత పౌరుడు అన్న ఆ మౌలిక ప్రశ్న ఇంకా మిగిలేవుందని దీని అర్థం. పౌరసత్వాన్ని నిర్ధారించే సార్వత్రిక, సర్వామోదిత పత్రం ఒక్కటీ ఇప్పటికీ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. ఒకపక్క ఉగ్రవాదం, తీవ్రవాదం, పొరుగు దేశాల నుంచి అక్రమవలసలు, చొరబాట్ల గురించి తీవ్రమైన వాగ్యుద్ధాలు చేస్తూ, ఎన్నికల్లో అత్యధికంగా లబ్ధిపొందుతూ, మరోపక్క పౌరులు కాదన్న పేరిట లక్షలాదిమందిని ఓటరు జాబితానుంచి తొలగిస్తూ ఎవరు పౌరులన్న ఈ ప్రశ్నను మాత్రం సమాధానం లేకుండా వదిలేయడం విచిత్రం. అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచి 2014 డిసెంబరు 31కి ముందు ఈ దేశంలోకి వచ్చిపడినవారికి కూడా పౌరసత్వాన్ని కట్టబెడుతూ, ఇక్కడ పాస్‌పోర్టులు ఉన్నంతమాత్రాన పౌరులు కానక్కరలేదని అనడం ఆశ్చర్యమే. పౌరసత్వానికి అంతిమంగా ఇదీ రుజువంటూ ఏదీ లేకుండా చేసి, దానిని నిరూపించుకోవాల్సిన బరువు మాత్రం జనం మీదకు నెట్టేయడం విషాదం. రేషన్‌కార్డు, ఓటరుకార్డు, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రభుత్వాలు మంజూరు చేసేవి సంఖ్యానేకం. ఇవన్నీ ఒకదాని ఆధారంగా మరొకటి మంజూరు అవుతూ పరస్పరం ముడిపడివున్నవే. అయినప్పటికీ, ఈ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఆ జాబితాలో ఏ ఒక్కటీ మనలను పౌరుడిగా గుర్తించదు, మరేది నిశ్చయంగా నిర్ధారిస్తుందో తెలియదు. ఆధార్ ప్రాజెక్టు ఆరంభిస్తున్నప్పుడూ, దానిని బలవంతంగా ప్రభుత్వ సేవలతో అనుసంధానిస్తున్నప్పుడూ పాలకులు చాలా మాటలు చెప్పారు. ఇటీవలివరకూ పాస్‌పోర్టుకు కూడా మూలధారం ఆధార్ నెంబరే కానీ, ఇప్పుడు అదీ పనికిరాకుండా పోయింది. సహజంగా అధికారులు ఆయా సందర్భాలను బట్టి ఏవో పత్రాల మీద ఆధారపడతారు. కానీ, రాజకీయ అవసరాలు, రేపటి ఎత్తులూ జిత్తులు ముందుకువచ్చి ప్రధానమైపోయినప్పుడు ప్రజలకు ఇటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. తమ గుర్తింపును నిరూపించుకోవడం వారికి అతిపెద్ద సవాలుగా పరిణమిస్తుంది. పౌరసత్వ రాజకీయాలు కొనసాగుతున్నంతకాలం ఈ అగ్నిపరీక్షలు తప్పవేమో.

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం

**మొదటిపేజీ తరువాయి -** అనిత వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంతరాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి -** దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి



**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ప్రభుత్వ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ అడిగే రోజులు వచ్చాయి

**మొదటిపేజీ తరువాయి -** 55 మందికి రూ. 30 వేల నగదు బహుమతి, ఇంటర్ టాపర్లు 61 మందికి ల్యాప్‌టాప్‌లు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "నిద్రలో కనిపించేది కల కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వనిదే నిజమైన కల. నిద్రపోకుండా మీరు పడిన కష్టమే మిమ్మల్ని షైనింగ్ స్టార్స్‌గా నిలబెట్టింది. మీరు గెలిచారు, నన్ను గెలిపించారు, మన విద్యావ్యవస్థను గెలిపించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీ పనితీరు వల్ల మంత్రిగా నాకు, 2 లక్షల మంది ఉపాధ్యాయులకు గౌరవం పెరిగింది" అని విద్యార్థులను ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ఎమ్మెల్యేల సిఫార్సులు అడిగే రోజులు వచ్చాయని, మంగళగిరిలో ఒక తల్లి తనను నిడమర్రు స్కూలులో సీటు ఇప్పించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

### విద్యారంగంలో సమూల మార్పులు

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన లోకేశ్, ఫలితాలు వెంటనే రావని, నిరంతరం శ్రమిస్తేనే పంట చేతికొచ్చిన ఆనందం దక్కుతుందని అన్నారు. విద్యార్థులను కేంద్రంగా చేసుకుని అనేక సంస్కరణలు చేపట్టామని వివరించారు. "గతంలో పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల బొమ్మలుండేవి. నాకు ఆ ఫోటో పిచ్చి లేదు. అందుకే బ్యాగ్‌పై, బెల్ట్‌పై, గుడ్డుపై, స్కూలులో ఎక్కడా బొమ్మలు లేకుండా చేశాం. పాఠశాలల్లో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశాం" అని తెలిపారు. 'వన్ క్లాస్-వన్ టీచర్', డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్, డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసి భోజన నాణ్యతను మరింత పెంచుతామని హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నామని తెలిపారు.

### విలువలకే పెద్దపీట

విలువలు లేని సమాజం ప్రమాదకరమని, అందుకే నైతిక విలువల కోసం చాగంటి కోటేశ్వరరావు గారిని సలహాదారుగా నియమించామని లోకేశ్ పేర్కొన్నారు. "అమ్మకు చెప్పలేని పని చేయొద్దు అనే ఆయన మాట చాలా శక్తివంతమైనది. మహిళలను గౌరవించడం ఇంటి నుంచే మొదలుకావాలి. తల్లికి వందనం వంటి కార్యక్రమాల ద్వారా ఆ మార్పునకు శ్రీకారం చుట్టాం" అని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని కలలు కనడంతో పాటు, రాజకీయాల్లోకి వచ్చి సమాజాన్ని మార్చే నాయకులుగా కూడా ఎదగాలని ఆకాంక్షించారు.

### ఓటమి నుంచే పాఠాలు నేర్చుకోవాలి

తన రాజకీయ జీవితాన్ని ఉదాహరణగా చూపుతూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. "2019లో ఇదే మంగళగిరి నియోజకవర్గంలో ఓడిపోయినప్పుడు బాధ కలిగినా, పట్టుదలతో ఐదేళ్లు పనిచేసి 91 వేల మెజారిటీతో గెలిచాను. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయొద్దు. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్ అని గుర్తుంచుకోండి" అని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. చదువు పూర్తయ్యాక, అవకాశం వచ్చినప్పుడు సొంత పాఠశాలకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారీయా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**మొదటిపేజీ తరువాయి -**
ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఇంకా కాంగ్రెస్ పార్టీలోని తోటి సహచరులు, ఎంపీలకు, నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవ ప్రయాణంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహంతో నాకు అండగా నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను.'. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు. నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.

## ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు రక్తపాతం!

**మొదటిపేజీ తరువాయి -** మృతులంతా ఉగ్రవాదులేనని పాకిస్థాన్ వాదిస్తుండగా, అమాయక పౌరులు, చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఆఫ్ఘనిస్థాన్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో పాక్ సైన్యం అనుసరించిన వివాదాస్పద 'డబుల్ ట్యాప్' వ్యూహం తీవ్ర విమర్శలకు దారితీసింది.

### ఏమిటీ 'డబుల్ ట్యాప్' దాడి?

సైనిక పరిభాషలో 'డబుల్ ట్యాప్' అంటే ఒకే ప్రదేశంపై కొద్ది వ్యవధిలో రెండోసారి దాడి చేయడం. ఇది అత్యంత క్రూరమైన, అమానవీయమైన వ్యూహంగా పరిగణిస్తారు. ఎందుకంటే, మొదటి దాడి తర్వాత సహాయక చర్యల కోసం వచ్చే సిబ్బంది, వైద్యులు, పౌరులను లక్ష్యంగా చేసుకుని రెండో దాడి జరుపుతారు. భారత కాలమానం ప్రకారం నిన్న అర్ధరాత్రి 12:30 గంటలకు పాక్ వైమానిక దళం (పీఏఎఫ్) జెట్లు ఆఫ్ఘనిస్థాన్‌లోని పక్తికా, పక్తియా, కునార్ జిల్లాల్లోని ఇళ్లు, మసీదులపై బాంబులు వేశాయి. సరిగ్గా 25 నిమిషాల తర్వాత అంటే 12:55 గంటలకు, శిథిలాల కింద చిక్కుకున్న మహిళలు, పిల్లలను కాపాడేందుకు గ్రామస్థులు పరుగెత్తుకురాగా, పాక్ జెట్లు మళ్లీ విరుచుకుపడి వారిపైనే రెండోసారి బాంబుల వర్షం కురిపించాయి. ఈ రెండో దాడి కారణంగానే మృతుల సంఖ్య అనూహ్యంగా పెరిగి, వందకు పైగా క్షతగాత్రులతో ఆసుపత్రులు నిండిపోయాయి.

### పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ వాదనలు

గతవారం కరాచీలో తమ సైనిక దళాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) నుంచి విడిపోయిన జమాత్-ఉల్-అహ్రార్ ఉగ్రవాదుల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపామని, ఇందులో 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ తెలిపారు. అయితే, పాకిస్థాన్ వాదనను ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపందల చర్య అని, పాక్ దురాక్రమణకు పాల్పడిందని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మండిపడ్డారు. ఈ దాడుల్లో 35 మందికి పైగా అమాయక పౌరులు మరణించారని, వీరిలో 4 నుంచి 9 ఏళ్ల వయసున్న చిన్నారులు, వృద్ధులు ఉన్నారని ఆయన తెలిపారు. "దాడి జరిగినప్పుడు ఆ ప్రాంతంలో ఎలాంటి ఉగ్రవాదులు లేరు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న మాపైనే రెండోసారి బాంబు వేశారు. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు పాకిస్థాన్ అబద్ధాలు చెబుతోంది" అని దాడిలో గాయపడిన ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాక్-ఆఫ్ఘన్ సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం ఇస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, తమ భూభాగంలో ఉగ్రవాదులు ఎవరూ లేరని తాలిబన్లు స్పష్టం చేస్తున్నారు. గత 9 నెలల్లో పాకిస్థాన్ జరిపిన దాడుల్లో సుమారు 570 మంది అమాయక ఆఫ్ఘన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ శాంతి దూతగా వ్యవహరిస్తూ, మరోవైపు పొరుగు దేశంపై దాడులకు పాల్పడటం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది.

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క



**మొదటిపేజీ తరువాయి -** అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## ఢిల్లీని కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** జులై 1 నుంచి అమల్లోకి వచ్చి, 2030 మార్చి 31 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ పాలసీ ద్వారా రాబోయే నాలుగేళ్లలో పౌరులకు సుమారు రూ. 15,000 కోట్ల ప్రయోజనాలు చేకూరుతాయని సీఎం వివరించారు. ఇందులో భాగంగా, ప్రభుత్వం నేరుగా రూ. 7,000 కోట్లను ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనుంది. మరో రూ. 8,000 కోట్లను పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాల రూపంలో ఈవీ వినియోగదారులకు అందిస్తుంది. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆమోదం తర్వాత ఈ పాలసీ అధికారికంగా అమల్లోకి వస్తుంది. ఈ కొత్త పాలసీలో భాగంగా, 2027 జనవరి 1వ తేదీ నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా నిషేధిస్తారు. ఆ తర్వాత కేవలం ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అదేవిధంగా, 2028 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెట్రోల్, సీఎన్‌జీ టూవీలర్ల రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేయనున్నారు. కొత్త విధానం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. కార్ల విషయానికొస్తే, రూ. 30 లక్షల లోపు ఎక్స్-షోరూమ్ ధర ఉన్న వాహనాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, తేలికపాటి గూడ్స్ ట్రక్కులు, గ్రామీణ సేవా వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలకు ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణ వాహనాలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మధ్య ధర వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ రాయితీలు రూపొందించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. "కాలుష్య రహిత, స్వచ్ఛమైన రవాణా రాజధానిగా ఢిల్లీని మార్చడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం" అని ఆమె పేర్కొన్నారు. వాహనాల కొనుగోలును ప్రోత్సహించడమే కాకుండా, పాత వాహనాల తుక్కు (స్క్రాపింగ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఈ పాలసీ దృష్టి సారిస్తుందని ఆమె వివరించారు. ఈ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కేబినెట్ మంత్రులు పంకజ్ కుమార్ సింగ్, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సాలను సీఎం అభినందించారు.

## అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలి

**మొదటిపేజీ తరువాయి -** పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు.( ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం



**మొదటిపేజీ తరువాయి -** ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైం దని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జులై 4న టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. చివరి అంత్యక్రియలు జులై 9న ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లోని ఇమామ్ రెజా దర్గా వద్ద జరగనున్నాయి.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సీఎం రేవంత్ సభ రద్దు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు.

# అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి

### జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





**ఒంగోలు, జూన్ 29.అక్షర టైమ్స్ :** "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో అందిన అర్జీలను నిర్దిష్టమైన గడువులోపు పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి మాధురి, ఎస్.డీ.సీ. శాంతి లక్ష్మి, డిపిఓ వెంకటేశ్వర రావు లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అలాగే సంబంధిత అర్జీలు రీ ఓపెన్ కాకుండా నాణ్యతతో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్ మెంట్ ఇవ్వాలని తెలిపారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో మొత్తం 268 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లు !

**దేశం మొత్తం ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలి**

**వచ్చే ఏడాది 2లక్షలమంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు రావాలి**

**విద్యార్థికోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టాం**

**ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు రికమండేషన్ అడిగే రోజులు వచ్చాయి**

**షైనింగ్ స్టార్స్ సత్కార కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్**












**అమరావతి,జూన్29.అక్షర టైమ్స్:-(ఏపీ స్టేట్ బ్యూరో,షేక్.కరిముల్లా) :** ఇప్పుడు మనం బెస్ట్ టీచర్లను సింగపూర్, ఫిన్ లాండ్ కి పంపుతున్నాం. అక్కడ ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. నా కోరిక ఒక్కటే. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలి. వచ్చే ఏడాది రెండు లక్షల మంది ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలి, షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గత ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ తరపున మంత్రి లోకేష్ తాడేపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాలు వేదికగా ఘనంగా సత్కరించారు. 55మంది టెన్త్ షైనింగ్ స్టార్లకు రూ. 30 వేలు ప్రైజ్ మనీ, మెడల్, సర్టిఫికేట్, 61మంది ఇంటర్మీడియట్ షైనింగ్ స్టార్లకు ల్యాప్ ట్యాప్, మెడల్ అందజేశారు.

**మీరు గెలిచారు, నన్ను గెలిపించారు**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షైనింగ్ స్టార్స్... మిమ్మల్ని చూసిన తర్వాత నాకు అబ్దుల్ కలాం చెప్పిన ఒక మాట చెప్పాలనిపించింది. నిద్రలో కనిపించేది కల కాదు... కల మిమ్మల్ని నిద్రపోనివ్వదు. నిద్రపోకుండా మీరు పడిన కష్టం మిమ్మల్ని షైనింగ్ స్టార్స్ గా నిలబెట్టింది. మీరు గెలిచారు...నన్ను గెలిపించారు. మన విద్యావ్యవస్థను గెలిపించారు. మీరు పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీకు తక్కువ మార్కులు వస్తే నాకు సీఎం తక్కువ మార్కులు వేస్తారు. షైనింగ్ స్టార్స్ ఎక్కువ మార్క్స్ తెచ్చుకున్నారు. నాకు ఎక్కువ మార్కులు పడేలా చేశారు. మీ పెర్ఫార్మెన్స్ వల్ల మంత్రిగా నా గౌరవంతో పాటు 2 లక్షల మంది టీచర్ల గౌరవం కూడా పెరిగింది. గతంలో ప్రభుత్వ స్కూళ్లంటే చిన్నచూపు ఉండేది. చరిత్ర తిరగరాసిన ఘనత మీ అందరిది. జులైలో మెగా పిటిఎం నిర్వహిస్తాం. మొదటి పిటిఎంలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెస్తానని చెప్పా. మీ అందరి కృషి, కష్టంతో ఆ మాటను సుసాధ్యం చేశా.

**విద్యాశాఖ వ్యవసాయం లాంటిదే!**

విద్యాశాఖ వ్యవసాయం లాంటిది, చాలా కష్టమైంది. ఫలితాలు వెంటనే రావు. ప్రతిరోజు నీళ్లు పోయాలి, ఎరువు వేయాలి, పంట చేతికొచ్చినపుడు రైతులకు కలిగిన ఆనందం ఈరోజు నాకు కలుగుతోంది. ఇంకా కష్టపడాలి, పనిచేయాలి, కలసికట్టు సరికొత్త చరిత్ర సృష్టించాలి. ఈరోజు విద్యార్థులు రాసిన డ్రీమ్ వాల్, గ్రాటిట్యూడ్ వాల్స్ చూశాను. విద్యార్థులు డాక్టర్, ఇంజనీర్, ఐఎఎస్ అవుతానని రాశారు. ఏ ఒక్కరూ రాజకీయ నాయకుడ్ని అవుతా, సమాజాన్ని మారుస్తానని రాయలేదు. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజంలో మార్పు సాధించాలని కోరుకుంటున్నా. మొదటి సారి ప్రభుత్వ పాఠశాలల పిల్లల ఫోటోలు పేపర్ అడ్వర్టైజ్‌మెంట్ లో చూసినప్పుడు నాకు చెప్పలేని ఆనందం కలిగింది. ఈరోజు చాలా గర్వంగా ఉంది. ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 1.06లక్షలమంది వచ్చారు. ఆ క్రెడిట్ అంతా ఇక్కడున్న షైనింగ్ స్టార్లదే.

**నా డ్రీమ్ ను మీరు సాకారం చేశారు**

ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ మన సిబిఎన్. ప్రభుత్వ పాఠశాలలకు షైనింగ్ స్టార్స్ బ్రాండ్ అంబాసిడర్లు. మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. మీ సక్సెస్ స్టోరీ ఏంటో తెలుసుకోవాలనే ఈ ప్రోగ్రాం ఏర్పాటు చేశాను. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా గవర్నమెంట్ స్కూల్స్ ను తయారు చెయ్యాలని టార్గెట్ పెట్టుకొని పనిచేస్తున్నాం. నేను ఫస్ట్ టైమ్ మెగా పిటిఎం పెట్టినప్పుడు చెప్పాను. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఎలాంటి ప్రకటనలు ఇస్తాయో అలానే ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు సక్సెస్ కూడా సెలబ్రేట్ చేస్తానని చెప్పారు. నా డ్రీం మీరు సాకారం చేసారు. మీ ఫోటోలతో ప్రకటన ఇచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూళ్ల కోసం ఎమ్మెల్యేల రికమెండేషన్ కోరే రోజు వస్తుందని అసెంబ్లీ సాక్షిగా చెప్పా. మంగళగిరి నియోజకవర్గంలో ఒక అభివృద్ధి కార్యక్రమానికి వెళితే ఒక తల్లి నాతో నిడమర్రు స్కూలులో సీటు కావాలని గొడవపడింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఇలాగే తయారు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జీవితంలో బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఎడ్యుకేషన్. మెటీరియల్ గా సాధించినవి ఏదో ఒకరోజు మనవద్ద నుంచి పోవచ్చు. మనవద్ద నుంచి ఎవరూ తీసుకెళ్లలేనిది విద్య.

**ప్రభుత్వ స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు**

ఇప్పుడు గవర్నమెంట్ స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు చూసే రోజు వచ్చింది. షైనింగ్ స్టార్స్ విజయం వెనుక టీచర్ల కృషి ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఉంది. ఎవరైనా ఒక సబ్జెక్ట్ లో వీక్ గా ఉంటే స్పెషల్ కేర్ తీసుకున్నారు. ఫైనల్ గా ఎగ్జామ్స్ లో అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ ఫలితం వెనుక ఎంతో మంది కష్టం ఉంది. ఇదంతా ఒక్కరోజులో అవ్వలేదు...ఒక నెలలో అవ్వలేదు...విద్యా వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి నాకు రెండేళ్ళు పట్టింది. నేను విద్యామంత్రి అయినపుడు పలువురు సౌకర్యాల గురించి అడిగారు. అందరూ హార్డ్ వేర్ బాగుంటే చాలు అనుకుంటారు. హార్డ్ వేర్ అంటే బిల్డింగ్స్, ఫ్యాన్లు, టాయిలెట్స్. వాటితోపాటు సాఫ్ట్ వేర్ కూడా ముఖ్యమే. సాఫ్ట్‌వేర్ అంటే నాణ్యమైన విద్య. మంత్రిగా బాధ్యత తీసుకున్న మొదటి రోజు నుండే నేను ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ - లీప్ మిషన్ స్టార్ట్ చేశాను, లీప్ యాప్ తెచ్చాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్ తెచ్చాం. విద్యాశాఖలో రాజకీయ రంగులు ఉండకూడదని నిర్ణయం తీసుకున్నా. గతంలో టెక్స్ట్ బుక్ లో ముఖ్యమంత్రి, మంత్రి, అధికారుల సందేశాలు ఉండేవి, వాటన్నింటినీ తీసేశాం.

**విద్యార్థుల కోణం నుంచే సంస్కరణలు**

నేను తీసుకొచ్చిన ప్రతి సంస్కరణ విద్యార్థుల కోణంలో ఆలోచించి తీసుకున్నాం. విద్యార్థులను సెంటర్ ఆఫ్ యూనివర్స్ గా పెట్టుకొని పని చేసాం. వన్ క్లాస్ వన్ టీచర్ గేమ్ ఛేంజర్ గా తీసుకున్నాం. ఇప్పుడు 10వేల స్కూళ్లలో వన్ క్లాస్ వన్ టీచర్ ఇంప్లిమెంట్ చేస్తున్నాం. కరిక్యులం మార్చాం. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్ ఇస్తున్నాం. డొక్కా సీతమ్మ పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఇంకా ఇంప్రూవ్ చేయాలని విద్యార్థులు రాశారు. మొదటి పిటిఎం బాపట్లలో జరిగింది. పిల్లలు తిన్న భోజనమే సిఎం తిన్నారు. ఆరోజు ముఖ్యమంత్రి పిల్లలకు పెట్టే భోజనం క్వాలిటీ మార్చాలన్నారు. ఈరోజు ఫైన్ రైస్ తెచ్చాం, కడప కలెక్టర్ ఆధ్వర్యంలో స్మార్ట్ కిచెన్ తెచ్చాం. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని కేంద్రం కూడా పోత్సహిస్తోంది. ఇంకా ఇంప్రూవ్ చేసే బాధ్యత తీసుకుంటాం. త్వరలో రాష్ట్రం మొత్తం సెంట్రలైజ్డ్ కిచెన్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ సంవత్సరం మిల్లెట్ చిక్కీ ప్రవేశపెట్టాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నాం. మెగా డిఎస్సీ నిర్వహించి 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. నో బ్యాగ్ డే అమలుచేసి విద్యార్థి ఆల్ రౌండ్ డెవలప్ మెంట్ కోసం కృషి చేస్తున్నాం. పాసివ్ లెర్నింగ్ నుంచి యాక్టివ్ లెర్నింగ్ కు మార్చడానికి క్లిక్కర్ టెక్నాలజీ తీసుకొచ్చాం. త్వరలో ఎఐ ట్యూటర్ ను కూడా తీసుకొస్తున్నాం. సంస్కరణల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో గతఏడాది పదోతరగతి ఉత్తీర్ణతాశాతం 72.8 శాతం నుంచి 78.39 శాతానికి పెరిగింది.

**విలువలులేని సమాజం ప్రమాదకరం**

విలువలు లేని సమాజం దేశానికి ప్రమాదం. నైతిక విలువలు నేర్పడం చాలా ముఖ్యం. అందుకే చాగంటి కోటేశ్వర్ రావు ని విలువ ఆధారిత విద్యకి సలహాదారుగా నియమించాం. ఆయన చెప్పిన ఒక మాట నాకు బాగా గుర్తు ఉండిపోయింది. అమ్మకు చెప్పలేని పని చేయొద్దు. వినడానికి చాలా సింపుల్ గా ఉంది. కానీ, చాలా పవర్ ఫుల్ అది. ఒక పనిచేసే ముందు ఇది మన అమ్మకి చెప్పగలమా లేదా అని ఆలోచించుకుంటే సమాజంలో చాలా మార్పు వస్తుంది. ఇంకొక ముఖ్యమైన విషయం మహిళల్ని గౌరవించడం. కేవలం చట్టాల వల్ల రక్షణ రాదు. మార్పు ఇంటి నుండి మొదలు కావాలి. ఇప్పటికి కొంతమంది మహిళల్ని అవమానించే మాటలు మాట్లాడుతున్నారు. గాజులు తొడుక్కున్నావా, చీరకట్టుకున్నావా, అమ్మాయిలా ఏడవొద్దు. ఇలాంటి మాటలు ఎవరైనా మాట్లాడితే ఆపమని గట్టిగా చెప్పండి. మహిళల్ని గౌరవించడం చిన్నప్పటి నుండే నేర్పిస్తున్నాం. మెగా పీటీఎం జరిగినప్పుడు తల్లికి వందనం చేస్తున్నాం.

**పాఠశాలల్లో నో పాలిటిక్స్**

నేను విద్యాశాఖ మంత్రి అయ్యినప్పుడు తీసుకున్న మొదటి నిర్ణయం పాఠశాలల్లో రాజకీయాలు వద్దు. బ్యాగ్ మీద నో బొమ్మ...బెల్ట్ మీద నో బొమ్మ...గుడ్డు మీద నో బొమ్మ...స్కూలులో నో బొమ్మ... నాకు ఫోటో పిచ్చి లేదు. టెక్స్ట్ బుక్స్ లో కూడా నా ఫోటో లేదు.. సీఎం ఫోటో లేదు. రాజకీయ కార్యక్రమాలకి ఇప్పుడు స్కూళ్లలో పర్మిషన్ ఇవ్వడం లేదు. మీరు లైఫ్ లో చాలా సవాళ్లు ఎదుర్కొంటారు. నా లైఫే మీకు బెస్ట్ ఎగ్జాంపుల్. మార్పు మన ఇంటి నుంచే మొదలు కావాలి. కలసికట్టుగా ముందుకు తీసుకెళ్తేనే సమాజంలో మార్పు వస్తుంది. మార్పుకు మీరు దివిటీలు కావాలి. మీ జీవన ప్రయాణంలో అనేక సవాళ్లు వస్తాయి. అందుకు నేనే ఉదాహరణ. ఇదే నియోజకవర్గంలో 2019లో పోటీచేసి 5300 ఓట్లతో ఓడిపోయా. తొలిరోజు బాధ, ఆవేదన కలిగాయి. రెండోరోజు నుంచి కసి పెంచాయి. అయిదేళ్లు కష్టపడి పనిచేశా, 91వేల మెజారిటీతో గెలిపించారు. 1985 తర్వాత గెలవని నియోజకవర్గం ఇది. నేను కోరుకుంటే మరో నియోజకవర్గానికి వెళ్లొచ్చు. చాలెంజ్ గా తీసుకున్నాను.

**ప్రతివిద్యార్థిపై ప్రభుత్వ ఖర్చు చేస్తోంది**

జీవితంలో కష్టాలు వస్తాయి, అధిగమించే శక్తి కూడా దేవుడు మనకు ఇస్తాడు. తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడి మిమ్మల్ని చదివిస్తున్నారు. దయచేసి ఇది మరువద్దు. జీవన ప్రయాణంలో అనేక దెబ్బలు తగులుతాయి. ఫెయిల్ అంటే ఫస్ట్ ఎటెంప్ట్ ఇన్ లెర్నింగ్. తప్పును ఎంత త్వరగా సరిదిద్దుకుంటామన్నదే ముఖ్యం. విద్యార్థులు ఒక సబ్జెక్టు ఫెయిలైతే ఆత్మహత్య చేసుకుంటున్నారు. దీనివల్ల తల్లిదండ్రులు ఎంత బాధపడతారో ఆలోచించాలి. జీవితంలో అనేక ఎదురు దెబ్బలు తగులుతాయి. కష్టపడటానికి ప్రత్యామ్నాయం లేదు. దేశం కోసం ప్రధాని మోడీజీ ఎంతో కష్టపడుతున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం లక్షరూపాయలు ఖర్చుపెడుతోంది. ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. మీ స్కూలును మర్చిపోవద్దు. మీకు చాన్స్ దొరికినపుడు మీ వంతు సహాయం ఆ పాఠశాలకు అందజేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ తమీమ్ అన్సారీయా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలి

### ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు





**ఒంగోలు,జూన్ 29.అక్షర టైమ్స్ :** ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించుటకు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)" కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుదిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల వ్రాతపూర్వక వినతులను జిల్లా ఎస్పీ మరియు పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో ఫిర్యాదుదారుల వివరాలు తెలియజేసి, తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, భాధితులకు న్యాయం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులో ఫిర్యాదులు పరిష్కారించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారిలో వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో లేదా నడవలేని స్థితిలో ఉన్నవారు కూడా ఉంటారని, అటువంటి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపి, మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను పూర్తిగా విని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ - డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్/భూ/ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేదింపులు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలు, చీటింగ్ మొదలగు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ డి.ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, కందుకూరు సీఐ అన్వర్ బాష, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై లు జనార్ధన్ రావు, యాస్మిన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు,జూన్29.అక్షర టైమ్స్ :** గిద్దలూరు మండలం, దేవనగరం గ్రామంలో నిర్వహించిన మరియ రోజా మిస్టికా వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ముందుగా దేవనగర గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రార్థన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి క్రైస్తవ సోదర , సోదరీమణులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికీ మరియా మాత కృప అందరి పై ఉండాలి అని శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఒంగోలులో రూ.3.80 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభం

**సబ్ స్టేషన్ నిర్మాణంతో లో-వోల్టేజ్ సమస్యలకు చెక్ , నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం: మంత్రి గొట్టిపాటి**





**ఒంగోలు,జూన్29.అక్షర టైమ్స్ :** ప్రజలకు లో వోల్టేజ్ సమస్యలు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఒంగోలు హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ.3.80 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకు 25 సబ్ స్టేషన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటిలో కొన్ని ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, మిగిలినవి తుది దశలో ఉండటంతో త్వరలోనే పూర్తి చేసి ప్రారంభిస్తామని చెప్పారు. మరోవైపు యర్రగొండపాలెంలో సుమారు రూ.70 కోట్లతో ట్రాన్స్ కో 220 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం కొనసాగుతోందని, కొత్తపట్నం, తాళ్లూరులోనూ కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా ఒంగోలు నగరంలో 240 విద్యుత్ టవర్ల నిర్మాణం చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.1.20 లక్షల విలువైన 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. బీసీ వినియోగదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సహకారంతో రూ.98 వేల సబ్సిడీ, ఓసీ వినియోగదారులకు రూ.78 వేల సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ రంగ అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా మౌలిక వసతులను విస్తరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతిందని విమర్శించారు. రాబోయే వ్యవసాయ సీజన్‌కు ముందే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తదితర మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసి, రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. రైతులకు పగటిపూటే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి పోస్టర్‌ను ఆవిష్కరించిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి

**దర్శి,జూన్ 29.అక్షర టైమ్స్ :** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్, దర్శి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణా రెడ్డి రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్, దర్శి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణా రెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడుతూ, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానాయకుడని అన్నారు. రైతు సంక్షేమం, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన మహానేత ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందని ఆమె స్పష్టం చేశారు. వైఎస్ షర్మిల రెడ్డి,



మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జూలై 8న రాష్ట్రవ్యాప్తంగా ఆయన 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కైపు వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని, ఆయన ప్రజాసేవ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర చైర్మన్, దర్శి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కేకేసీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ఉద్యోగులు ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే దర్శి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జూలై 8న భారీ ఎత్తున మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టి మహానేత ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కైపు వెంకటకృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా కేకేసీ తరఫున ప్రత్యేకంగా రూపొందించిన ఈ పోస్టర్‌ను రాష్ట్రవ్యాప్తంగా కేకేసీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీలు విస్తృతంగా పంపిణీ చేసి, మహానేత ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర చైర్మన్ కైపు వెంకటకృష్ణా రెడ్డి కోరారు.

## యర్రవరం గ్రామంలో వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

**ప్రతిష్ట సందర్భంగా కుమార సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన**



**ఏలేశ్వరం,జూన్29.అక్షర టైమ్స్ :** కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలో ఏలేరు నదీ తీరాన ఉన్న శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది.గ్రామ ప్రజలు,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించగా,ఈరోజు ఉదయం 7:18 గంటలకు ధ్వజస్తంభ పునఃప్రతిష్ట అత్యంత రమణీయంగా,భక్తుల సమక్షంలో జరిగింది.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేయగా,వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.వేద మంత్రోచ్చారణలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు స్వదేశానికి కంబాల శ్రీనివాసరావు



**గోకవరం,జూన్29.అక్షర టైమ్స్ :** విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, దంపతులు అమెరికా పర్యటనను ముగించుకుని మంగళవారం భారతదేశానికి తిరికి వస్తున్నారు. గతనెల 21వ తేదీన కంబాల శ్రీనివాసరావు దంపతులు అమెరికాకు వెళ్లారు. 40 రోజులు అనంతరం ఈ నెల 30వ తేదీన మంగళవారం మధ్యాహ్నం 3:30 నిముషాలకు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటున్నారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కంబాల శ్రీనివాసరావుకి స్వాగతం పలికేందుకు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ఏర్పాట్లు చేసారు. ఆయన మధురపూడి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత, అక్కడ నుంచి కోరుకొండ మీదగా గోకవరం సీఎండీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నారు.

## వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి

**విద్యార్థినుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**నాణ్యమైన వసతులు, మెరుగైన అవకాశాలపై ప్రత్యేక దృష్టి**





**అమరావతి/ఒంగోలు,జూన్ 29.అక్షర టైమ్స్:-(ఏపీ స్టేట్ బ్యూరో, షేక్.కరిముల్లా) :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాలోని పలు సంక్షేమ సంస్థలను ఆకస్మికంగా సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు మరియు అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట మద్దిపాడు మండలం, యడుగుండ్లపాడు గ్రామాన్ని సందర్శించిన డైరెక్టర్, 'ప్రధాన్ మంత్రి ఆదర్శ గ్రామ యోజన' (పి ఎం ఎ జి వై) కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామాభివృద్ధి పనులు నాణ్యతతో పాటు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం ఒంగోలు భాగ్యనగర్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాలు - 2 మరియు 3 లను సందర్శించి విద్యార్థిను లతో ఆత్మీయంగా ముచ్చటించారు. హాస్టళ్లలో అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రత, భద్రత తదితర అంశాలపై స్వయంగా విద్యార్థినుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసం కొనసాగించేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత (పబ్లిక్ పర్సెప్షన్) గురించి అవగాహన కల్పించారు. విద్యతో పాటు మంచి ప్రవర్తన, ఆత్మవిశ్వాసం, సమాజం పట్ల బాధ్యతాయుతమైన వైఖరి ప్రతి విద్యార్థిలో ఉండాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థినులతో



ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకు నేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ అందిస్తున్నట్లు వివరించి, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న నెలల్లో విద్యార్థినులకు నైట్ డ్రెస్సులు, టవల్స్, దుప్పట్లు, స్పోర్ట్స్ షూస్, పడకలు తదితర అవసరమైన వస్తువులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి వసతి గృహంలో 'ఎంప్లాయ్‌మెంట్ న్యూస్' పత్రికను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని హాస్టల్ వెల్ఫేర్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా విద్యార్థినుల గదులు, భోజనశాల, వంటగది, స్టోర్‌రూమ్, వాషింగ్ ఏరియా తదితర విభాగాలను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. పరిశుభ్రత, పారిశుధ్యం, నిర్వహణ ప్రమాణాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తూ విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. చివరిగా సక్కుబాయమ్మ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహాల పునరుద్ధరణ పనులను పరిశీలించి, నిర్మాణ పనులను అత్యున్నత నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు పూర్తి చేసి విద్యార్థినులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఎన్. లక్ష్మా నాయక్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రబియా, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు శిరీష, శ్రీలత తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థినుల సంక్షేమం, నాణ్యమైన వసతి సౌకర్యాల కల్పన, మెరుగైన విద్యా మరియు ఉపాధి అవకాశాల సృష్టికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు.

## ఓటర్ల జాబితా సవరణలో ఖచ్చితత్వం,పారదర్శకత పాటించాలి

**జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్**




**శేరిలింగంపల్లి,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 అమలు సమీక్షపై తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అధ్యక్షతన సోమవారం ఒక ముఖ్యమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశానికి శేరిలింగంపల్లి ఈఆర్ఓ మరియు వెస్ట్ జోన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ హాజరయ్యారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో 052-శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సహాయ ఎన్నికల నమోదు అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ముఖ్యమైన మార్గదర్శకాలు ఆదేశాలు సమర్థవంతమైన నిర్వహణ 'సర్-2026'ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు ముఖ్య ఎన్నికల అధికారి జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలను ఈ సమావేశంలో వివరంగా సమీక్షించారు.నిర్ణీత గడువు కు సంబంధిత అధికారులందరూ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే రివిజన్ ప్రక్రియను కచ్చితంగా నిర్వహించాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.పారదర్శకత: ఓటర్ల జాబితా సవరణలో పూర్తి ఖచ్చితత్వం, పారదర్శకత పాటించడంతో పాటు, అన్ని కార్యకలాపాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు.

## గాదరాడలో వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన,కుంభాభిషేక మహోత్సవాలు

**కనులపండువగా సాగిన సప్త దేవతల కళ్యాణ ఘట్టం**

**భక్తులతో కిక్కిరిసిన 'ఓం శివశక్తి పీఠం - శంబాల నగరం**

**ఆలయాల్ని స్వయంగా నిర్మించి, ఆధ్యాత్మిక సేవలో**

**తరించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**

**రాజానగరం,జూన్29.అక్షర టైమ్స్ :** కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరిసింది. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ స్వయంగా నిర్మించిన అత్యంత ప్రతిష్ఠాత్మక ఆధ్యాత్మిక కేంద్రం "ఓం శివశక్తి పీఠం - శంబాల నగరం" నందు గత కొన్ని రోజులుగా శాస్త్రోక్తంగా జరుగుతున్న నూతన 36 దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠాపన, మహా కుంభాభిషేక వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా, మంగళప్రదంగా ముగిశాయి. ఈ ఉత్సవాల ముగింపు ఘట్టంగా నిర్వహించిన సప్త దేవతల కళ్యాణ మహోత్సవం భక్తజనకోటిని విశేషంగా అలరించింది.మహోత్సవాల ముగింపు రోజైన నేడు ఉదయం నుంచే ఆలయ ప్రాంగణంలో వేద పండితులు, అర్చక బృందం ఆధ్వర్యంలో విశేష హోమాలు, జపాలు, పూర్ణాహుతి మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దివ్యమైన వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణమంతా శివశక్తి స్మరణతో, భక్తి పారవశ్యంతో ప్రతిధ్వనించింది.లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సర్వాంగ సుందరంగా అలంకరించిన కళ్యాణ మండపంలో సప్త దేవతల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్త విధివిధానాలతో



జరిగిన ఈ దివ్య వివాహ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముగింపు వేడుక కావడంతో గాదరాడ గ్రామంతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల నుండి భక్తజనం భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కళ్యాణాన్ని కళ్లారా చూసి తరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.దివ్య కళ్యాణానంతరం భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వేలాది మంది భక్తులకు మహాప్రసాదాన్ని అందించేలా భారీ ఎత్తున అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా రాజానగరం శాసనసభ్యులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... గాదరాడ పుణ్యభూమిపై ఈ 'ఓం శివశక్తి పీఠం - శంబాల నగరం' నిర్మించి, ఇంతటి మహత్కార్యాన్ని పూర్తి చేసే భాగ్యం కలగడం తన పూర్వజన్మ సుకృతమని ఆనందం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా అహర్నిశలు శ్రమిస్తూ ఈ మహా





కుంభాభిషేక మహోత్సవాలను, ప్రతిష్ఠాపన వేడుకలను ఇంతటి ఘన విజయవంతం చేసిన భక్తులకు, గ్రామ పెద్దలకు, స్వచ్ఛంద సేవకులకు మరియు రాత్రింబవళ్లు శ్రమించిన కమిటీ సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ సప్త దేవతల కృపాకటాక్షాలు, ఆశీస్సులు నిరంతరం ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## చర్లపల్లి - కుషాయిగూడలో ఎన్నికల అవగాహన జోరు





**కుషాయిగూడ,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** కుషాయిగూడ, చర్లపల్లి డివిజన్ల పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యం, ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి పోలింగ్ జరిగే వరకు ప్రతి దశలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) ప్రజలకు అందుబాటులో ఉండి, ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు.కుషాయిగూడ డివిజన్‌లోని చక్రిపురం, వాసవి శివనగర్, మారుతి కాలనీలతో పాటు చర్లపల్లి డివిజన్‌లోని పలు బూత్‌లను సందర్శించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పర్యవేక్షకులు బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ యాదవ్, వెంకటేష్‌తో పాటు సంబంధిత బీఎల్ఓలు, బీఎల్ఏలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రంప ఎర్రపాలెంలో పేకాటపై దాడి

**ముగ్గురు అరెస్ట్ రూ.4500 నగదు స్వాధీనం**

**గోకవరం,జూన్29.అక్షర టైమ్స్ :** గోకవరం మండలం రంప ఎర్రపాలెం గ్రామ శివారులో తోటలో పేకాట ఆడుతున్న వారిపై గోకవరం ఎస్సై వి. ఎన్.వి.పవన్ కుమార్ ఆదేశాల మేరకు మహిళా ఎస్సై బి. నాగమణి, సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు సోమవారం ఆయన తెలిపారు. ఈ దాడిలో మొత్తం ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.4,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.మండలంలో జరుగుతున్న పేకాట, జూదం మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన ఏ సమాచారం ఉన్న తన మొబైల్ నంబర్ 9440904830 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## షేక్ ఖాదర్ బాషాకు ఘనంగా సన్మానం



**పొదలకూరు,జూన్29.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** వెంకటాచలం ఇరిగేషన్ కనుపూరు కెనాల్ సబ్ డివిజన్ వర్క్ చార్జెడ్ ఉద్యోగి షేక్ ఖాదర్ బాషా పదవీ విరమణ సందర్భంగా రిటైర్డ్ డిఈఈ సమివుల్లా, తోటి ఉద్యోగులు, ఘనంగా పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం గంగవరపు. వేణుగోపాల్ రెడ్డి, మాట్లాడుతూ 38సంవత్సరాలు అంకిత భావంతో ఉద్యోగం చేసి అందరి మన్నలు పొందిన వ్యక్తి ఖాదర్ బాషా అని కొనియాడారు. అదేవిదంగా ఉద్యోగం పట్ల ఆయన చూపిన చొరవ ఎందరికో ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగజ్యోతి, ఏఈఈ పెంచలరావు, వినోద్, తిరుపతయ్య, సునీల్, అరుణ, కోడి నాగయ్య, మునిస్వామి, కోటమ్మ, ఖాదర్ మొహిద్దీన్, కుటుంబ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ఆదర్శ్ రెడ్డి ప్రయత్నం

**సభకు అనుమతి నిరాకరించిన కాంగ్రెస్ ప్రభుత్వం**



**పటాన్చెరు,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** పటాన్చెరు పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదానికి ఏడాది పూర్తవుతున్న తరుణంలో, మృతుల కుటుంబాలకు నివాళులు అర్పించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ బాధ్యులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ఒక సంస్మరణ సభను తలపెట్టారు. జూన్ 30న పాశమైలారం బీపీఎల్ చౌరస్తాలో ఈ సభ నిర్వహించాలని నిర్ణయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు అనుమతిని నిరాకరించింది.ప్రభుత్వ నిరంకుశ పోకడల వల్ల రేపు జరగాల్సిన సంస్మరణ సభను రద్దు చేస్తున్నట్లు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి ప్రకటించారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి ఆవేదనను అర్థం చేసుకోకుండా సభను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, ఇస్నాపూర్ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, యువ నాయకుడు మేరాజ్ ఖాన్, స్థానిక కౌన్సిలర్లు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఒమ్మంగిలో గంజాయి,డ్రగ్స్ నివారణపై ఎస్సై లక్ష్మీకాంతం అవగాహన కార్యక్రమం

**గంజాయి,మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై లక్ష్మీకాంతం సూచన**

**గంజాయి,డ్రగ్స్ అక్రమ రవాణాపై సమాచారం అందిస్తే గోప్యతతో కఠిన చర్యలు**



**ఏలేశ్వరం,జూన్29.అక్షర టైమ్స్ :** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామం ఎస్సీ పేటలో కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఉత్తర్వులతో,పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ఆదేశాలతో,సీఐ బిఎస్ అప్పారావు పర్యవేక్షణలో ఎస్సై ఎస్ లక్ష్మికాంతం సోమవారం గంజాయి వంటి మత్తు పదార్థాలు మరియు ఇతర డ్రగ్స్‌కి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మికాంతం మాట్లాడుతూ యువత గంజాయి,ఇతర డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపారు. విద్యార్థులు, యువకులు మంచి అలవాట్లను అలవర్చుకుని చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.గ్రామంలో గంజాయి సహా డ్రగ్స్ వినియోగం,విక్రయాలు వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా 112 కు ఫోన్ చేసి తెలియజేయాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై లక్ష్మికాంతం స్థానికులను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.పోలీసులు డ్రగ్స్,గంజాయి వ్యతిరేక నినాదాలతో అవగాహన కల్పించారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్తు నిర్మాతలు

**గూడెం మధుసూదన్ రెడ్డి**





**ఇంద్రేశం,జూన్29.అక్షర టైమ్స్: ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని ఆర్కే 1 కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ది మాస్టర్ మైండ్స్ స్కూల్' ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి పాఠశాలను ప్రారంభించి, యాజమాన్యానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గూడెం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు గురించి దిశానిర్దేశం చేశారు:"పిల్లలు ఈ దేశానికి, సమాజానికి అసలైన ఆస్తి. నేటి విద్యా విధానం కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేలా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం మార్కుల కోసం కాకుండా, క్రమశిక్షణతో కూడిన పరిపూర్ణ వ్యక్తిత్వంతో తీర్చిదిద్దే పాఠశాలలను ఎంచుకోవాలి. విద్యార్థులు చిన్నతనం నుండే సామాజిక బాధ్యతను, నైతిక విలువలను అలవర్చుకున్నప్పుడే వారు గొప్ప ప్రయోజకులుగా మారుతారు. 'ది మాస్టర్ మైండ్స్ స్కూల్' అటువంటి ఉన్నత లక్ష్యంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతుందని నేను నమ్ముతున్నాను," అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, షకీల్, ఇతర ముఖ్య నాయకులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో వివరాల నమోదు తప్పనిసరి

**అమీన్‌పూర్ ఇంద్రమ్మ కాలనీలో రెండో రోజు కొనసాగిన పత్రాల పంపిణీ**



**అమీన్‌పూర్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** అమీన్‌పూర్ పరిధిలోని ఇంద్రమ్మ కాలనీలో ఓటరు జాబితా పత్రాల పంపిణీ కార్యక్రమం రెండో రోజు కూడా ఉత్సాహంగా కొనసాగింది. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటరు జాబితాను పారదర్శకంగా మరియు తప్పులు లేకుండా నిర్వహించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కాలనీ వాసి గుంటి శేఖర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ, "ఎవరైనా పంపిణీ చేస్తున్న ఈ ఫారమ్‌లను తీసుకోకుండా, వాటిని పూర్తి చేసి ఎన్నికల సంఘం అధికారులకు సమర్పించకపోతే, ఓటరు జాబితా నుండి వారి పేరు తొలగిపోయే అవకాశం ఉంది. దీనివల్ల భవిష్యత్తులో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు.కాలనీ వాసులందరూ వెంటనే అప్రమత్తమై, అధికారులు అందిస్తున్న పత్రాలను సేకరించి, తమ వివరాలను సరిచూసుకోవాలని, అసంపూర్తిగా ఉన్న సమాచారాన్ని పూర్తి చేసి సమర్పించాలని శేఖర్ కోరారు.ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించడం మరియు పత్రాల పంపిణీ ద్వారా ఓటరు జాబితాలో తప్పులను సరిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొని, ఎన్నికల ప్రక్రియలో భాగంగా తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు.

# బీడీఎల్ కాలనీలో ప్రజా సమస్యలపై ఆదర్శ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన



**పటాన్‌చెరు,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి రిపోర్టింగ్ ఎం.వీరేష్ :** భారతి నగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ సందర్భంగా వారు బీడీఎల్ కాలనీ నుంచి రాయసంద్రం చెరువు వరకు ఉన్న ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఇంజినీరింగ్ ఏఈ శివ పాల్గొన్నారు. కాలనీలో రాత్రి వేళల్లో కొంతమంది మద్యం సేవించి సంచరిస్తూ, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని నివాసితులు వారి దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన ఆదర్శ్ రెడ్డి, ముఖ్యంగా వారాంతాల్లో (వీకెండ్స్‌లో) పోలీసు శాఖ ఆధ్వర్యంలో తరచూ పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్‌ను కోరారు. అలాగే, అక్రమ రాకపోకలను నియంత్రించి, కాలనీ భద్రతను మెరుగుపరిచేందుకు వీలుగా సంబంధిత ప్రాంతంలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ ఏఈ శివకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీడీఎల్ కాలనీ సొసైటీ డైరెక్టర్లు రమేష్, విఠల్ రెడ్డి, పాషా, స్థానిక నివాసితులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బావోజిపేట గ్రామానికి బోర్‌వెల్ విరాళం



**గోకవరం,జూన్29.అక్షర టైమ్స్ :** సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్ ) కార్యక్రమాల్లో భాగంగా అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బావోజిపేట గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్‌వెల్‌ను విరాళంగా అందించింది.ఈ సందర్భంగా సంస్థ వైస్ ప్రెసిడెంట్ వివేక్ శుక్లా మరియు యూనిట్ హెడ్ దేవేంద్ర కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం మరియు జీవన ప్రమాణాల మెరుగుదల కోసం సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా పరిసర గ్రామాల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.బావోజిపేట గ్రామ ప్రజలు అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గ్రామాల్లో చేపడుతున్న వివిధ సి ఎస్ అర్ కార్యక్రమాలను అభినందిస్తూ, బోర్‌వెల్ ఏర్పాటు చేసినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పిల్లా అర్జున సారధి (చంటి బాబు ) మాట్లాడుతూ, "మా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసిన అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్



లిమిటెడ్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. గ్రామాభివృద్ధికి సంస్థ చేపడుతున్న వివిధ సి ఎస్ అర్ కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయమైనవి. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగాలని కోరుకుంటున్నాము" అని అన్నారు.అదేవిధంగా మాజీ సర్పంచ్ నాగవిష్ణు మాటాడుతూ, "బావోజిపేట గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి బోర్‌వెల్‌ను అందించిన అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని ఆశిష్ గుర్నానికు మా గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు. సంస్థ గ్రామాల అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయం. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాము" అని తెలిపారు.గ్రామ పెద్దలు, ప్రజాప్రతి నిధులు మరియు గ్రామస్తులు వల్లెపల్లి రామ చంద్రరావు (పంచాయితీ డెవలప్మెంట్ ఆఫీసర్ ,బత్తుల సారంగధరుడు (స్టేట్ యూత్ ప్రెసిడెంట్ టీడీపీ ),గొంతిన అప్పలస్వామి ,గొర్రెల శ్రీనివాస్ ,కొత్తల వీర అప్పారావు,బలిజ నరసింహారావు ,విరోతి వెంకటేశ్వరరావు,ఈ కార్యక్రమంలో పాల్గొని సంస్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని శంకర్, సీనియర్ మేనేజర్. సూర్య, ఎచ్ ఎస్ ఈ మేనేజర్, జి . సన్యాసి రావు , ఎచ్ అర్ మేనేజర్ మరియు వర ప్రసాద్ ఎచ్ అర్ , పి .అర్ .ఓ . రాజేశ్వరి , నాగదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ ఆశయాలే నేటి యువతకు ఆదర్శం



**గోకవరం,జూన్29.అక్షర టైమ్స్ :** తూర్పుగోదావరి జిల్లా ఆర్ఎస్ఎస్ సేవా ప్రచార ప్రముఖ్ శివ బాల సీఎండీ లే అవుట్ లో హిందూ సామ్రాజ్య దినోత్సవ కార్యక్రమం గోకవరం జూన్ 29: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గోకవరం తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ వద్ద ఆదివారం సాయంత్రం హిందూ సామ్రాజ్య దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా ఆర్ఎస్ఎస్ సేవ ప్రచార ప్రముఖ్ శివ బాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు జరుపబడుతున్నాయన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ భారతీయ




చరిత్రలోనే అత్యంత పరాక్రమవంతుడైన రాజులలో ఒకరు అన్నారు. 16వ శతాబ్దంలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హిందూ సామ్రాజ్యానికి, ఊపిరి పోసిన వ్యక్తి ఛత్రపతి శివాజీ అన్నారు. 1630 ఫిబ్రవరి 19న మహారాష్ట్ర, పూణే జిల్లాలో షాహాజీ భోంస్లే, జిజాబాయి దంపతులకు జన్మించారని, తల్లి జిజాబాయి చిన్నతనం నుంచే శివాజీకి రామాయణ, మహాభారత గాథలను నేర్పించి, దేశభక్తిని, ధర్మాన్ని రక్షించాలనే పట్టుదలను నూరిపోశారన్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే తోరణ కోటను స్వాధీనం చేసుకుని తన విజయయాత్రను ప్రారంభించి, సుమారు 33 సంవత్సరాల పాటు నిర్వీర్యంగా యుద్ధాలు చేసి 300 పైగా కోటలపై విజయం సాధించి హిందూ సామ్రాజ్యాన్ని నిర్మాణం చేశారన్నారు. 1674 జూన్ 6న రాయ్‌గఢ్ కోటలో శివాజీకి వైభవంగా పట్టాభిషేకం జరిగిందని, అప్పటి నుండి ఆయనను ఛత్రపతి (సార్వభౌముడు)గా పిలవబడుతున్నారన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్నే ప్రతి సంవత్సరం హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటారని తెలిపారు. ఛత్రపతి శివాజీ ఇతర మతాలను గౌరవిస్తూ, మతసామరస్యాన్ని పాటించేవారని, మహిళలను అత్యంత గౌరవంగా చూసేలా కఠినమైన చట్టాలు అమలు చేశారన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని నేటి యువతకు స్ఫూర్తిదాయకం. తీసుకొని, ఆయన ఆశయ సాధనలకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, కరిబండి వెంకటేశ్వరరావు, తుమ్మల బుజ్జి, పదిలం చక్రరావు, ఆదం మణికంఠ, కేబుల్ రాజు, పద్దరాజు, రాఘవ, స్థానిక ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత తొలగింపుపై నిప్పులు చెరిగిన వేముల మారయ్య

**ప్రభుత్వ చర్య వివక్ష పూరితం.. వెంటనే భద్రతను పునరుద్ధరించాలి**

**ఉప్పల్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** ఉప్పల్ పరిధిలోని నాచారం డివిజన్ పరిధిలో హెచ్ఎంటి కమాన్ వద్ద ప్రెస్ మీట్ పెట్టిన వేముల మారయ్య మాట్లాడుతూ మాజీ ఐపీఎస్ అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఉన్న భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం హఠాత్తుగా తొలగించడంపై బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రెస్ మీట్ నిర్వహించి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

**ప్రభుత్వాన్ని నిలదీసిన మారయ్య**

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడికి భద్రత తగ్గించడం అంటే, ఆయన గొంతును నొక్కడమేనని వేముల మారయ్య ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అయితే కక్షపూరితంగా ప్రవర్తించడం సరికాదని ఆయన హెచ్చరించారు. ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నందుకే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ని లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ధ్వజమెత్తారు.

**ప్రభుత్వానికి కీలక డిమాండ్లు:**

వెంటనే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను పునరుద్ధరించాలి. రాజకీయాలను పక్కన పెట్టి, ప్రజానాయకుల భద్రత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.ఒకవేళ ఆయనకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోందని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వేముల మారయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై నిరసనలు



తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ పి ఆటో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు నాయక్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పరుశురాం యాదవ్ తిరుమల్ హైమద్ భాయ్ పలువురు సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరత్‌నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి

**ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం**

**'సర్' ప్రక్రియ పారదర్శకంగా జరగాలి**

**మందుముల పరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్‌లో ఆయన విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) కలిసి, ఓటర్ల నమోదు, మార్పులు, సవరణల ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనపై ఆరా తీసిన ఆయన, అర్హులైన ఒక్క ఓటరు పేరు



కూడా పొరపాటున జాబితా నుంచి తొలగిపోకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న పరమేశ్వర్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే కొత్త ఓటర్ల



నమోదు, సవరణల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పూర్తి సహకారం అందిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేసి, ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# మియాపూర్‌లో ఘనంగా ఉచిత గొడుగుల పంపిణీ

**దాతృత్వాన్ని చాటుకున్న ప్రసాద్స్ ఫౌండేషన్**



**మియాపూర్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** వర్షాకాలాన్ని పురస్కరించుకుని పేద మహిళలకు చేయూత తనిచ్చేందుకు మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్.ఆర్. ఎస్టేట్స్, దాని చుట్టుపక్కల కాలనీలలో ఉచిత గొడుగుల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. దోనేపూడి రమాదేవి ప్రసాద్ ఆధ్వర్యంలో, ప్రసాద్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చేతులమీదుగా ప్రారంభం**

ఈ సేవా కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి తన చేతులమీదుగా ప్రారంభించారు. మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రత్యేక సహకారంతో, ఎమ్మెల్యే ఆశీస్సులతో ఈ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ సందర్భంగా కాలనీల్లో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే 113 మంది పేద మహిళలకు గొడుగులను అందజేశారు. గొడుగులు అందుకున్న మహిళలు ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషాన్ని



వ్యక్తపరిచారు.

**48వ సేవా కార్యక్రమం దోనేపూడి రమాదేవి**

ఈ సందర్భంగా ప్రసాద్స్ ఫౌండేషన్ ప్రతినిధి దోనేపూడి రమాదేవి మాట్లాడుతూ "సమాజ సేవలో భాగంగా తమా ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 48వ సేవా కార్యక్రమం ఇది. ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ గత 20 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. 'అందరికీ ఆరోగ్యం' అనే సంకల్పంతో ఇప్పటివరకు 18 మెగా ఉచిత వైద్య శిబిరాలను, 48 రకాల సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాం. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల ముందుకు వస్తామని

**సహకరించిన వారికి కృతజ్ఞతలు**

ఈ బృహత్తర కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందించిన శాంతి అమ్మ, రాజేశ్వరి అమ్మ, గాయత్రి, మంజుల,రాజేశ్వరి, రమ, మాధురి, శైలశ్రీ, రాజీ,రమా శాస్త్రి, ఉష,సుజాత, చుక్క రమ, ఈశ్వరి,పద్మశ్రీ,శిరీషలకు అలాగే ప్రసాద్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అండ్ చీఫ్ కోఆర్డినేటర్ లీలా ప్రసాద్‌లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాకేష్ చౌదరి, శ్రీను చౌదరి, ప్రసాద్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, సంతోష్ మరియు స్థానిక కాలనీవాసులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జులై 1న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి.రామకృష్ణ పిలుపు**

**శేరిలింగంపల్లి,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే ఇంటి స్థలాలు, ఇంటి పట్టాలు మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 1న నిర్వహించ తలపెట్టిన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలు సొంత ఇంటి స్థలం, పట్టా కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, భూమి లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు.

**పేదల ఇళ్లను విస్మరించి.. కార్పొరేట్లకు భూములు!**

ఒకవైపు పేద ప్రజలు తలదాచుకోవడానికి నివాస స్థలాలు లేక ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు విలువైన ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వం



ధారాదత్తం చేస్తోందని రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఇది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి సజీవ నిదర్శనమని ఆయన విమర్శించారు.

**శేరిలింగంపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూపులు**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయంలో ఎన్నోసార్లు వినతిపత్రాలు, అర్జీలు సమర్పించామని ఆయన గుర్తు చేశారు. ఇక్కడ ఇళ్లు లేని పేదలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారందరికీ వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో 'చలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్' ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.

**ఉద్యమాలు ఉధృతం చేస్తాం: సిపిఐ హెచ్చరిక**

సొంత ఇంటి కల సాకారం చేసుకునేందుకు జరుగుతున్న ఈ పోరాటంలో నిరుపేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని రామకృష్ణ కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి:అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం, పట్టా మంజూరు చేయాలి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు పంపిణీ చేయాలి. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చని పక్షంలో, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాలు, భూ పోరాటాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మక్తా మహబూబ్‌పేట్‌లో ఘనంగా పల్స్ పోలియో సేవా కార్యక్రమాలతో ఆకట్టుకున్న రవీగౌడ్



**మియాపూర్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** మక్తా మహబూబ్‌పేట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంతో పాటు, అంగన్‌వాడీ టీచర్లు, వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలను వేశారు.పోలియో రహిత భారతదేశమే లక్ష్యం: రాచమల్ల రవీగౌడ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సంఘసేవకులు, మియాపూర్ గ్రామస్థులు రాచమల్ల రవీగౌడ్ విధుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బందిని, వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన తన స్వంత ఖర్చులతో పోలియో సిబ్బందికి, వాలంటీర్లకు మరియు అక్కడకు వచ్చిన తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేశారు. వారితో కలిసి రవీగౌడ్ భోజనం చేశారు."మానవ సేవయే మాధవ సేవ. సమాజ ఆరోగ్య రక్షణ కోసం అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అమూల్యమైనవి. ప్రతి తల్లిదండ్రూ బాధ్యతగా తమ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి. పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి." అని ఈ సందర్భంగా రాచమల్ల రవీగౌడ్ పిలుపునిచ్చారు.ఈ సేవా కార్యక్రమంలో మియాపూర్ వాస్తవ్యులు మన్నే సురేష్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం నాయకులు ముద్దంగుల తిరుపతి, తాండ్ర రామచందర్ గౌడ్, మన్నే నరేందర్ ముదిరాజ్, ముద్దంగుల గిరి, తాండ్ర మహిపాల్ గౌడ్, బాలాజీ మరియు దూశ్రీ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి - 43 ఫిర్యాదుల స్వీకరణ

**సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: కమిషనర్ ఆదేశం**

**శేర్లింగంపల్లి,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి ఎం.ఈరన్న :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పౌరులు తమ పరిధిలోని పలు సమస్యలు, వినతులు మరియు సూచనలను నేరుగా కమిషనర్‌కు సమర్పించారు.కమిషనర్ అన్ని శాఖల అధిపతుల సమక్షంలో ప్రతి వినతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, తగిన చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదుల వివరాలు:**




ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 43 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.టౌన్ ప్లానింగ్ విభాగం: 31,ఇంజినీరింగ్ విభాగం: 11,క్రీడల విభాగం: 01, పారదర్శకంగా ట్రాకింగ్ విధానం ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రత్యేక గ్రీవెన్స్ ఐడీ మరియు ట్రాకింగ్ లింక్ను కేటాయించారు. దీని ద్వారా పౌరులు తమ ఫిర్యాదు యొక్క పురోగతిని, అది ఏ దశలో ఉందనే విషయాన్ని పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు.చివరగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, నిర్దేశిత కాలపరిమితిలోగా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భవిష్యత్తులోనూ ప్రజావాణి ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# స్థానిక ప్రజలపై భారీ ట్రాఫిక్ చలాన్ల భారం తొలగించాలి

**ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కి వినతిపత్రం**

**అందజేసిన ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**

**ఉప్పల్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** వరంగల్ హైవే ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా పిస్తా హౌస్ నుండి మండే మార్కెట్ వరకు ఉన్న రోడ్డుపై స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) తెలిపారు.ఈ సమస్యపై సోమవారం ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, ఈ రోడ్డులో సెయింట్ మార్ఫ్స్ హై స్కూల్, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ వంటి పలు విద్యాసంస్థలు ఉన్నాయని, ప్రతిరోజూ వందలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా అనుకోకుండా కొన్ని మార్గాల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు.అయితే ట్రాఫిక్ సిబ్బంది వాహనాల ఫోటోలు తీసి రూ.1,200 నుంచి రూ.1,400 వరకు తప్పుదారి (రాంగ్ వే ) చలాన్లు విధిస్తున్నారని, కొంతమంది తల్లిదండ్రులకు వారానికి 2 నుంచి 4 చలాన్లు, అంటే రూ.4,000 నుంచి రూ.5,000 వరకు జరిమానాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి భారీ చలాన్లు మధ్యతరగతి, పేద కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం మోపుతున్నాయని, ప్రజలు ఉద్దేశపూర్వకంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం లేదని, సరైన మార్గదర్శకాలు లేకపోవడం మరియు డైవర్షన్ల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు.కాబట్టి స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పిస్తా హౌస్--మండే మార్కెట్ రోడ్డుపై స్థానికులకు విధిస్తున్న తప్పుదారి చలాన్లను నిలిపివేయాలని, ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయాలని, స్పష్టమైన ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని,పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని ట్రాఫిక్ శాఖను కోరారు.ఈ విషయంపై సానుకూలంగా స్పందించి స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు



ని కోరారు.

# చిర్యాలలో చైన్ స్నాచింగ్ కేసు ఛేదన - బంగారం స్వాధీనం

**వృద్ధురాలి మెడలో 4 తులాల బంగారు పుస్తెలతాడు**

**లాక్కెళ్లిన దుండగుడు అరెస్ట్**

**సీసీటీవీ ఆధారాలతో చాకచక్యంగా ఛేదించిన కీసర**

**పోలీసులు బంగారం,ద్విచక్ర వాహనం స్వాధీనం**

**కీసర,జూన్ 29.అక్షర టైమ్స్:-ప్రతినిధి గోపగాని పాండు :** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వృద్ధురాలి మెడలో బంగారు పుస్తెలతాడు లాక్కెళ్లిన కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి, దోచుకున్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడుతో పాటు నేరానికి వినియోగించిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిర్యాల గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లమ్మ అనే వృద్ధ మహిళ జూన్ 26న తన ఇంట్లో ఒంటరిగా ఉండగా, నిందితుడు కత్తి అనిల్ కుమార్ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించాడు. అనంతరం ఆమెను బెదిరించి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని అక్కడి నుంచి



పరారయ్యాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను నిశితంగా పరిశీలించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో పాటు గూఢచారి సమాచారాన్ని వినియోగించి సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అప్పుల భారంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ దోపిడీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారు



పుస్తెలతాడుతో పాటు నేరానికి ఉపయోగించిన హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.ఈ కేసును అత్యంత వేగంగా, సమర్థవంతంగా ఛేదించిన కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ అనిల్ కుమార్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ అభినందించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ప్రజలు తమ పరిసరాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# సర్ ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి

**ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన "సర్" సాఫీగా సాగేలా చూడాలని ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సోమవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్‌లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో "సర్" ప్రక్రియ తీరును పరిశీలించారు. కాలనీలలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) కలిసి 'సర్' ప్రక్రియ ఏ విధంగా జరుగుతోంది, నమోదు మరియు మార్పుల ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది అనే విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలను) కలిసి, భరత్ నగర్‌లో సర్వే ఏ విధంగా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు



కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సార్ ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ సార్ సవరణ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ లు) సహాయపడాలని సూచించారు.

# మహిళలకు వరంగా 'ఇందిరమ్మ చీరలు

**ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి**





**ఉప్పల్,జూన్29.అక్షర టైమ్స్:-ప్రతినిధి హరి మోహన్ రెడ్డి :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.ఉప్పల్ డివిజన్ పరిధిలోని ఉప్పల్ హిల్స్ లో చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీకి రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో నాసిరకం చీరలు ఇచ్చి మహిళల గౌరవాన్ని తగ్గించారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, చేనేత కార్మికులు రూపొందించిన చేనేత వస్త్రాలను 'ఇందిరమ్మ సారె'గా అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు.సోనియా గాంధీ ఆశయాల స్ఫూర్తితో మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఆడబిడ్డకు ఈ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తాము నిరంతరం శ్రమిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.అర్హులైన మహిళలంతా ఇందిరమ్మ చీరలు తీసుకోవాలని కోరారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కోటీశ్వరులు కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో దుర్గం నవీన్ యాదవ్ ,గోవింద్ ,శ్రీనివాస్ రెడ్డి ,సల్లా ప్రభాకర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి ,కుమార్ . కుమార్ స్వామి ,అక్కు రవి . ఆర్ పి దివ్య . అర్చన . దుర్గం రేణుక . శ్రావణి .తదితరులు పాల్గొన్నారు.

# కావలిలో ఎస్టీ నాయకులు ఉన్నారా.. లేరా..

**కులాలపై పదవులు పొంది బాధితులకు పరామర్శ లేదా..**



**కావలిలో కోడై కూస్తున్న వైనం**

**కావలి,జూన్29.అక్షర టైమ్స్ :** కావలిలో ఎస్టీలపై జరుగుతున్న సంఘటనలపై స్పందించే ఎస్టీ నాయకులు ఉన్నారా.., లేరా.. అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా సందర్భాల్లో ఎస్టీలపై జరుగుతున్న సంఘటనలపై కానరాని ఎస్టీ నాయకులు అని చర్చలు జరుగుతూ బేజారు చెందుతున్న ఆ జాతి బిడ్డలకు ఎందుకు అండగా నిలవడం లేదు అని విమర్శలు ఉన్నాయి. నెల్లూరు జిల్లా కావలి పట్టణం కచేరిమిట్టకు చెందిన ఒక ఎస్టీ మహిళకు అదే ప్రాంతానికి చెందిన షేక్ ఇబ్రహీం కుటుంబీకులు దొమ్మిగా వచ్చి కొట్టి వివస్త్రను చేసిన ఘటన సంచలనం రేపింది. ఇరు కుటుంబాల్లో అమ్మాయి, అబ్బాయి ప్రేమ వ్యవహారం కాస్త ఆ అబ్బాయికి చెందిన వితంతు తల్లి పీట్ల సుకుమారి నీ అమానుషంగా దాడి చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఇంతటి అవమానం జరిగితే కావలి నియోజకవర్గం లోని నేతలు, రాష్ట్రం లోని నేతలు, అధికారపార్టీ నేతలు, కుల పదవులు అనుభవిస్తున్న ఎస్టీ నాయకులు ఏమయ్యారు అని కావలి లోని మేధావులు, ప్రజలు కోడై కూస్తుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని, ఎస్టీ కులాలకు అండగా ఉంటామని ప్రమాణాలు చేసి రాష్ట్ర పదవిని అనుభవిస్తున్న నాయకులు కూడ కావలిలో ఉన్నారని అట్టి వారు కూడా ఈ ఎస్టీ మహిళ పీట్ల సుకుమారి కి అండగా నిలిచి న్యాయం చేయక పోవడం దారుణం అని కావలికి చెందిన మొగిలి కల్లయ్య పై పలువురు విమర్శలు చేస్తున్నారు.పార్టీల్లో ఉంటూ కులాలను అడ్డుపెట్టుకొని పదవులు పొందుతున్న వారిపై పట్టణ పుర ప్రముఖులు విమర్శలు వ్యక్తం చేస్తూ కోడై కూస్తుంది. ఇప్పటికైనా బాధితులకు అండగా ఉండి పరామర్శించి ప్రభుత్వం వారధిగా ఉండాలి, అంటే కానీ తమకేమి పట్టనట్లు, ఆ మహిళా ఎస్టీ కాదు అని రంగు రంగులు లాంటి మాటలు మారుస్తూ చేసే వ్యాఖ్యలు కరెక్టు కాదని విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీలో వర్గపోరు కారణంగా ఇంతకు ఈ రాష్ట్ర ఎస్టీ పదవి పొందిన నాయకులు మొగిలి కల్లయ్య ఎవరి పక్షము అనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

# నేడు మహిళలు ఇండ్లలో ఉన్నా.. రక్షణ లేదు.!

**గిరిజన మహిళపై ఇంతటి ఘోరమా**

**కావలి నీ కాపు కాస్తున్న ఎమ్మెల్యే ఎవరికి అండగా ఉన్నారు**

**ఎస్టీ మహిళపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**జిల్లా వైసీపీ పెద్దలు కాకాణి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి డిమాండ్**





**కావలి,జూన్29.అక్షర టైమ్స్ :** సభ్య సమాజం సిగ్గుపడేలా నేడు మహిళలు ఇండ్లలో ఉన్నా.. కూటమి ప్రభుత్వంలో వారిపై అఘాయిత్యాలు చేస్తూ.. రక్షణ లేకుండా ఉందని, పోలీస్ వ్యవస్థ నిద్రవస్తులో ఉంటూ పాలకులకు కొమ్ముకస్తు మనుగడ సాగిస్తున్నారని వైసీపీ పెద్దలు ఘాటుగా స్పందించారు. సోమవారం కావలి కచేరిమిట్ట ప్రాంతం నకు చెందిన పీట్ల సుకుమారి పై ఇటీవల జరిగిన ఘటనపై స్పందించిన వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రివర్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి విచ్చేసి బాధిత ఎస్టీ మహిళ కుటుంబానికి అండగా నిలిచారు. బాధితురాలికి జరిగిన సందర్భం అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు ఎస్టీ మహిళ పీట్ల సుకుమారి మాట్లాడుతూ తన కుమారుడు, 24వ వార్డు కచేరిమిట్ట మాజీ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం కుమార్తె ఇద్దరు ప్రేమించుకున్నారు అని ఇటీవల తెలిసింది. అందుకు కుమారుణ్ణి మందలిస్తూ తగాదాలకు వస్తారు మనకు వద్దు అని నచ్చచెప్పే క్రమంలో ఉన్నాను. ఈ క్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి మాజీ కౌన్సిలర్ షేక్ ఇబ్రహీం తనతో కూడా మహిళలు, పురుషులు దొమ్మిగా తమ ఇంటి వద్దకు వచ్చి, ఎరుకల దాన బయటకు రా.. అంటూ వచ్చి కేకలు వేయగా భయపడి దాముకొనగా, వారంతా దొమ్మిగా లోనకు వచ్చి కొట్టి ఒంటిపై బట్టలు లాగేసి వివస్త్రను చేసి కొట్టారని వాపోయారు. అదే రోజు రాత్రి మేము పోలీస్ స్టేషన్ కు వెళ్లేలోపు మమ్ములను కొట్టిన వారు మా కుమారునిపై తప్పుడు కేసు బనాయించి నట్లు తెలిపారు. అలాగే నీ కొడుకుపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం, రాజీకి రండి అని బెదిరించి సంతకాలు, వేలిముద్రలు నా వద్ద నుంచి తీసుకున్నారని కన్నీరు, మున్నీరుగా విలపిస్తూ గోడు వెళ్ళబుచ్చింది. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వయసులో ఉన్న పిల్లలు తప్పు చేసి ఉంటే పోలీస్ స్టేషన్లు, చట్టాలు ఉన్నాయని అంతమాత్రాన, ఇంట్లోకి దూరి ఒక ఎస్టీ మహిళపై అతి దారుణంగా వివస్త్రను చేసి కొట్టడం క్షేమించరాని నేరం అన్నారు. చట్టాలు, పోలీస్ స్టేషన్లు ఉన్నాయని చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవడం కూటమి ప్రభుత్వంలోని నాయకులకు మంచిది కాదు అన్నారు. ఈ ఎస్టీ మహిళపై జరిగిన సంఘటనకు వైసిపి అధిష్టానం మేరకు తామంతా అండగా ఉంటామన్నారు. బాధిత కుటుంబానికి పోలీస్ లు, ప్రభుత్వం న్యాయం చేసే వరకు తాము అండగా ఉంటామన్నారు. సందర్భంగా నెల్లూరు నుంచి విచ్చేసిన జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సమాచారం తనకు తెలిసి ఎంతగానో బాధ పడ్డానని, ప్రేమ వ్యవహారం పెద్దలు పరిష్కారం చేసి సమస్యను సరి చేయాలి తప్ప ఇంతగా కుటుంబంపై పడి ఎస్టీ మహిళ అన్నది కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టడం క్షేమించరాని నేరం అన్నారు. కావలి డీఎస్పీ తో కూడా మాట్లాడాను అని తెలిపారు. చట్టం తనపని తాను చేసుకోవాలి గానీ, పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయాల్లో రాజీ చేసే ప్రయత్నాలు చేసి ఎస్టీ మహిళను భయ భ్రాంతులకు గురిచేసి వారి నుంచి సంతకాలు, వేలిముద్రలు సేకరించి, సర్టిఫికెట్ లు ఎలా తారుమారు చేస్తారు అని, కేసు నీరు కార్చాలని చూడటం క్షేమించరాని నేరం అన్నారు. కావలినీ కాపు కాస్తున్న ఎమ్మెల్యే ఏమయ్యారు అని, అవినీతి పరులకు అండగా ఉన్నారా అని విమర్శలు చేశారు. నేడు కూటమి పాలనలో ఎక్కడ చూసినా మహిళలపై అఘాయిత్యాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇండ్లలో ఉన్న మహిళలకు రక్షణ లేని రోజులు నేడు కూటమి ప్రభుత్వం లో చూస్తున్నారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాన్ని గమనిస్తున్నారు అని అన్నారు. ప్రగల్భలు పలుకుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలకు, చేతలకు ఎలాంటి పొంతన లేదని విమర్శలు చేశారు. ఇది మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదు అని విమర్శలు చేశారు. కావలి పోలీసులు, రెవెన్యూ అధికారులు బాధిత, ఎస్సీ,ఎస్టీ, బడుగు బలహీన వర్గాల వారికి న్యాయం చేసే వారిగా ఉండాలే తప్ప, ఎమ్మెల్యే చెపితేనే కేసు కడతాను అనే వైఖరి మానుకోవాలి అన్నారు. మీ వంతుగా మీరు పోలీస్ స్టేషన్ లో రాజీ మంత్రం జపిస్తారా అంటూ అధికారులు, పోలీస్ వారిపై ఘాటుగా స్పందించారు. ఈ ఎస్టీ మహిళపై జరిగిన ఘటనపై వైసిపి పార్టీ అండగా నిలబడి ఉంటుందని, మాజీ ఎస్టీ చైర్మన్ కావలికి వచ్చి బాధితురాలి పక్షాన భరోసా కల్పించేందుకు నిలుస్తారు అన్నారు. ఈ విషయమై న్యాయం జరిగే వరకు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని, జిల్లా ఎస్పీ నీ కలిసి మాట్లాడుతాను అన్నారు. అధికార పార్టీకి కొమ్ము కాసే అధికారుల తీరు రాబోయే వైసిపి పాలనలో ఎలా ఉంటుందో గుర్తించుకోవాలని ఘాటుగా స్పష్టం చేశారు. సందర్భంగా పెద్ద సంఖ్యలో వైసిపి పార్టీ మహిళా నేతలు, మైనార్టీ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

# టర్టిల్‌మింట్ లిస్టింగ్ ఇన్వెస్టర్లకు నిరాశ

### 11 శాతం డిస్కౌంట్‌తో షేరు పతనం!



ఇన్సూరెన్స్ టెక్ కంపెనీ టర్టిల్‌మింట్ స్టాక్ మార్కెట్‌లో నిరాశాజనకంగా అడుగుపెట్టింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ లో ఈ షేరు 11 శాతం డిస్కౌంట్‌తో రూ. 135 వద్ద లిస్ట్ అయింది. ముంబైకి చెందిన ఈ ఇన్సూరెన్స్ టెక్ సంస్థ లిస్టింగ్ కోసం ఇన్వెస్టర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. ప్రస్తుతం ట్రేడింగ్ సెషన్‌లో ఈ స్టాక్ పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతుందనే దానిపై మార్కెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఒక చిన్న స్టార్టప్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి, నేడు స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యే స్థాయికి టర్టిల్‌మింట్ ఎదిగిన తీరు అద్భుతం. సామాన్యులకు ఇన్సూరెన్స్ కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయాలనే లక్ష్యంతో ధీరేంద్ర మహ్యావంశీ, ఆనంద్ ప్రభుదేశాయ్ ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. స్థానిక ఏజెంట్లకు స్మార్ట్ డిజిటల్ టూల్స్ అందిస్తూ, రిటైల్ మార్కెట్‌లో ఈ కంపెనీ వేగంగా పట్టు సాధించింది. మరిన్ని కనుగొనండి టర్టిల్‌మింట్ బిజినెస్ మోడల్.. భవిష్యత్తు లక్ష్యాలివే! టెక్నాలజీని, హ్యూమన్ నెట్‌వర్క్‌ను కలిపి ఈ సంస్థ ఒక హైబ్రిడ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌ప్లేస్‌గా పనిచేస్తోంది. లైఫ్, హెల్త్, మోటార్ ఇన్సూరెన్స్ వంటి రకరకాల సర్వీసులను ఇది కస్టమర్లకు అందిస్తోంది. ఏజెంట్ల ద్వారా చిన్న పట్టణాలకు కూడా చేరువ కావడంతో, కస్టమర్లను ఆకర్షించే ఖర్చు తక్కువగా ఉంటోంది. ఈ వ్యూహమే కంపెనీ వృద్ధికి ప్రధాన కారణమైంది. ఇన్వెస్టర్లు వచ్చే నెలలో ముగియనున్న యాంకర్ ఇన్వెస్టర్ల లాక్-ఇన్ పీరియడ్‌పై దృష్టి పెట్టాలి. పెద్ద ఇన్వెస్టర్లు తమ వాటాలను విక్రయించే అవకాశం ఉన్నందున, అప్పుడు షేరు ధరలో హెచ్చుతగ్గులు ఉండవచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లు ఇలాంటి కీలక తేదీలను గమనిస్తూ రిస్క్ మేనేజ్ చేసుకోవడం అవసరం. అలాగే, కంపెనీ మొదటి త్రైమాసిక ఫలితాలు ఇన్సూరెన్స్ టెక్ రంగం భవిష్యత్తును ప్రతిబింబిస్తాయి.మైలురాయి వివరాలు ఇష్యూ ధర 152 లిస్టింగ్ ధర 135 యాంకర్ లాక్-ఇన్ 30 రోజులు సెక్టార్ ఇన్సూరెన్స్ టెక్ టర్టిల్‌మింట్ ఇన్వెస్టర్ల కోసం కొన్ని సూచనలు రిటైల్ ఇన్వెస్టర్లు షార్ట్ టర్మ్ లాభాల కోసం చూస్తున్నారా లేదా లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ చేస్తున్నారా అనేది స్పష్టంగా ఉండాలి. మీ డీమ్యాట్ అకౌంట్‌లో షేర్ల అలాట్‌మెంట్, కొనుగోలు ధరను ఒకసారి చెక్ చేసుకోండి. ఒకవేళ మీరు ఈ షేర్లను హోల్డ్ చేయాలనుకుంటే, క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను నిబంధనలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. మీ పోర్ట్‌ఫోలియోను మేనేజ్ చేసేటప్పుడు డెలివరీ, ఇంట్రాడే ట్రేడింగ్‌ల మధ్య తేడాను గమనిస్తూ నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యం. భారతీయ స్టార్టప్ రంగంలో టర్టిల్‌మింట్ లిస్టింగ్ ఒక కొత్త అధ్యాయం. ప్రారంభంలో ధర తగ్గడం కొంత నిరాశ కలిగించినా, కంపెనీ పునాదులు బలంగా ఉన్నాయి. లాభాల బాటలో కంపెనీ ప్రయాణం, మార్కెట్ వాటా పెరుగుదలపై ఇన్వెస్టర్లు ఫోకస్ చేయాలి. సెక్టార్‌లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తెలివైన నిర్ణయాలు తీసుకోండి.

# రూ.45 లక్షల జీతం వచ్చినా నెలాఖరుకు ఏమీ మిగలడం లేదు

నా డబ్బు ఎక్కడికి వెళ్తోందంటూ రోదిస్తున్న బెంగళూరు టెకీ బెంగళూరుకు చెందిన ఒక సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌కు సంబంధించిన పాత ఇంటర్వ్యూ క్లిప్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఄ లో మళ్లీ ప్రత్యక్షమవ్వడంతో, మెట్రో నగరాల్లోని జీతాలు, విలాసవంతమైన జీవనశైలి, వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలపై నెటిజన్ల మధ్య ఒక ఆసక్తికరమైన చర్చ మొదలైంది. యూట్యూబ్‌లో మ్యూచువల్ ఫండ్ సలహాదారు అన్షుమాన్ శర్మ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో.. గత 14 ఏళ్లుగా బెంగళూరులో నివసిస్తున్న సూర్య అనే సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ తన నెలవారీ ఆదాయం, కుటుంబ ఖర్చులు, పొదుపు చేయడంలో తను ఎదుర్కొంటున్న సవాళ్లను పంచుకున్నారు. వార్షికంగా 45 లక్షల రూపాయల భారీ ప్యాకేజీని సంపాదిస్తూ.. అన్ని పన్నులు పోను ప్రతి నెలా దాదాపు 2.45 లక్షల రూపాయల నికర ఆదాయాన్ని ఇంటికి తీసుకువెళ్తున్నప్పటికీ, నెలాఖరు వచ్చేసరికి తన బ్యాంక్ ఖాతాలో ఏమీ మిగలడం లేదని దీవఅస్త్రుశ్రీబతీబ ఎవష్ట్రఅ అంగీకరించడం ఆన్‌లైన్ వేదికలపై పెద్ద చర్చకు దారితీసింది. ముఖ్యంగా వివాహం చేసుకుని, ఒక బిడ్డకు తండ్రి అయిన తర్వాత పెరిగిన కుటుంబ బాధ్యతల వల్ల తన సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ లను అనుకున్న స్థాయిలో పెంచలేకపోతున్నానని ఆయన వివరించారు. ఆయన పంచుకున్న నెలవారీ ఖర్చుల వివరాలను పరిశీలిస్తే.. అత్యధిక భాగం గృహ రుణ ఈఎంఐ ల రూపంలో 63,000 రూపాయల మేర వెళ్తోంది. అయితే ఈ మొత్తం ఆయన నెలవారీ ఆదాయంలో 30 శాతం కంటే తక్కువగానే ఉన్నందున, ఇది ఆర్థిక నియమాల ప్రకారం మంచి పరిమితిలోనే ఉందని నిపుణులు పేర్కొన్నారు. ఈ గృహ రుణం కాకుండా, తన కుమారుడి పాఠశాల ఫీజుల కోసం ప్రతి నెలా 11,000 రూపాయలు, ఇళ్లకు సంబంధించిన ఆహారం మరియు కిరాణా సామాగ్రి కోసం 12,000 రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హైదరాబాద్-బెంగళూరు 2 గంటల్లో.. 73 నిమిషాల్లో బెంగళూరు-చెన్నై.. కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు వస్తున్నాయ్.. వీటికి తోడు ఇతర నిత్యావసరాలు, వివిధ రకాల ఖర్చుల కింద మరో 20,000 రూపాయలు అవుతున్నాయి. అయితే సోషల్ మీడియాలో అత్యధికంగా చర్చకు దారితీసిన అంశం ఏమిటంటే, ఆయన షాపింగ్, ప్రయాణాలు (ట్రిప్స్), మరియు బయట హోటళ్లలో భోజనం చేయడం వంటి వినోదాల కోసమే ప్రతి నెలా సుమారు 32,000 రూపాయల భారీ మొత్తాన్ని వెచ్చిస్తున్నట్లు వెల్లడించడం. ఈ ఖర్చుల శైలిని చూసిన నెటిజన్లు ఄ లో రెండు భిన్నమైన అభిప్రాయాలతో స్పందించారు. ఒక వర్గం వారు దీనిని పేలవమైన ఆర్థిక ప్రణాళికగా అభివర్ణించారు. సంపాదన పెరిగే కొద్దీ ఖర్చులు పెంచుకుంటూ పోయే 'జీవనశైలి ద్రవ్యోల్బణం' లో ఆయన చిక్కుకున్నారని, ఎవరైనా సరే ముందుగా గృహ రుణం, ఆహారం, చదువు వంటి ప్రాథమిక అవసరాలను, తమకు కావలసినంత




పొదుపు మొత్తాన్ని పక్కన పెట్టుకున్నాకే మిగిలిన డబ్బును విలాసాల కోసం ఖర్చు చేయాలని సలహా ఇచ్చారు. అయితే దీనికి పూర్తి భిన్నంగా స్పందించిన మరో వర్గం వారు, ఇందులో ఎలాంటి తప్పు లేదని సూర్యకు మద్దతుగా నిలిచారు. గృహ రుణం చెల్లించడం కూడా ఒక రకమైన ఆస్తి సృష్టి (పొదుపు) కిందకే వస్తుందని, అన్నీ పోను ఆయన తన తల్లిదండ్రులను, అమ్మమ్మను మరియు కుటుంబాన్ని చక్కగా చూసుకుంటూనే ఇంకా 25 శాతానికి పైగా ఆదాయాన్ని ఆదా చేయగలుగుతున్నారని గుర్తుచేశారు. ఒక వ్యక్తి అంతగా సంపాదిస్తున్నప్పుడు తన పిల్లలకు మంచి విద్యను అందిస్తూ, కుటుంబంతో కలిసి సరదాగా గడపడానికి డబ్బు ఖర్చు చేయడంలో ఎలాంటి తప్పులేదని వారు సమర్థించారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్.. ఇల్లు కొనుగోలుదారులకు బిగ్ షాక్



60 వేలకు పైగా ఫ్లాట్లు పెండింగ్.. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ సంఘర్షణల ప్రభావం హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్రంగా పడింది. సరఫరా గొలుసు , లాజిస్టిక్స్‌లో ఏర్పడిన అంతరాయాల కారణంగా, నగరంలో తాము ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇళ్ల డెలివరీ కనీసం మరో ఏడాది పాటు ఆలస్యం కానుండటంతో వేలాది మంది గృహ కొనుగోలుదారులు తీవ్ర అనిశ్చితిలో పడిపోయారు. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ అనారోక్ గ్రూప్ అందించిన వివరాల ప్రకారం.. ఈ సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అప్పగించాల్సి ఉన్న దాదాపు 63,000 గృహ యూనిట్లు ఆలస్యమయ్యాయి. ఇది దేశవ్యాప్తంగా నిలిచిపోయిన మొత్తం గృహ నిల్వలో దాదాపు 10 శాతానికి సమానం కావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. చాలా మంది కొనుగోలుదారులు 2025 చివరి నాటికి లేదా 2026 మొదటి అర్ధభాగం నాటికి తమ సొంత అపార్ట్‌మెంట్లలోకి అడుగు పెట్టవచ్చనే అంచనాతో నాలుగైదు సంవత్సరాల క్రితమే భారీ మొత్తాలు చెల్లించి ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. అయితే దిగుమతి చేసుకున్న నిర్మాణ సామగ్రి కొరత, విపరీతంగా పెరుగుతున్న ముడిసరుకుల ఖర్చులు , కార్మికుల కొరత కారణంగా ప్రాజెక్టుల కాలపరిమితులు పూర్తిగా మారిపోయాయని డెవలపర్లు చెప్తున్నారు. ఈ జాప్యాల వల్ల ముఖ్యంగా బ్యాంకు రుణాల ద్వారా ఇళ్లను కొనుగోలు చేసిన మధ్యతరగతి, ఉద్యోగ వర్గాలపై రెట్టింపు ఆర్థిక భారం పడుతోంది. వారు ఒకవైపు నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లకు ప్రతి నెలా ఈఎంఐలు చెల్లిస్తూనే, మరోవైపు తాము ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్లకు భారీగా అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. ఉదాహరణకు కొండాపూర్‌లో ఫ్లాట్ కోసం రూ. 1.8 కోట్లు చెల్లించిన ఒక కొనుగోలుదారు ప్రతి నెలా రూ. 50 వేలు అద్దె భరిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైటెక్ సిటీలోని ఒక ప్రతిష్టాత్మక 38 అంతస్తుల భవనంలో రూ. 2.2 కోట్లు పూర్తిగా చెల్లించిన మరొక కొనుగోలుదారు మార్చి 2027 నాటికి కూడా ప్రాజెక్ట్ పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేరా చట్టం ప్రకారం ఫ్లాట్ అప్పగింత ఆలస్యమైతే డెవలపర్లు కొనుగోలుదారులకు నెలకు చదరపు అడుగుకు రూ. 25 చొప్పున నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. ూశ్రీంశీ =ఝుఎ ప్రభాస్ రియల్ ఎస్టేట్‌పై షాకింగ్ న్యూస్.. రూ.160 కోట్లతో అదిరిపోయే విల్లా.. మన హైదరాబాద్‌లోనే.. ఈ అంతరాయాలపై క్రెడాయ్ హైదరాబాద్ వర్గాలు స్పందిస్తూ.. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల టైల్స్, గ్రానైట్, కిటికీ అద్దాలు, ఎలివేటర్లు , అధునాతన విద్యుత్ పరికరాల దిగుమతి నిలిచిపోయిందని, దీనివల్ల నిర్మాణాల తుది పనులు మందగించాయని పేర్కొన్నారు. దాదాపు ప్రతి ప్రాజెక్టులోనూ కనీసం 9 నెలల నుండి ఏడాది పాటు ఆలస్యం జరిగే అవకాశం ఉన్నందున, గడువును పొడిగించాలని రేరాకు వినతిపత్రం కూడా సమర్పించారు. దీనికి తోడు, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాలకు వెళ్లిన నిర్మాణ రంగ కార్మికులు చాలా మంది తిరిగి రాకపోవడం కూడా ఈ ఆలస్యానికి మరో కారణమైంది. అనారోక్ గ్రూప్ పరిశోధనల ప్రకారం.. దేశంలోని అగ్రగామి 7 నగరాల్లో 2026 నాటికి రికార్డు స్థాయిలో 5.4 శ్రీఖఎష్ట్రం గృహ యూనిట్లు పూర్తి కావాల్సి ఉండగా.. ఈ ఆటంకాల వల్ల కేవలం 46 శాతం మాత్రమే లబ్ధిదారులకు అందేలా ఉన్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో దాదాపు 2,700 నివాస ప్రాజెక్టులు, 560 మిశ్రమ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉండగా, ఇళ్ల అప్పగింతలో జరుగుతున్న జాప్యంపై రేరా వద్ద ఇప్పటికే 2,800కు పైగా ఫిర్యాదులు నమోదు కావడం ఇక్కడి కొనుగోలుదారుల కష్టాలను ప్రతిబింబిస్తోంది.

# బేగంపేట ఎయిర్‌పోర్ట్ కింద భారీ టన్నెల్

### ఇక ఆ ఏరియాల్లో ట్రాఫిక్ కష్టాలుండవ్!

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ముఖ్యంగా సికింద్రాబాద్, ప్యారడైజ్ మీదుగా వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ ఒక పెద్ద సవాలుగా మారింది. అయితే, ఈ సమస్యకు పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం ఒక భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. బేగంపేట ఎయిర్‌పోర్ట్ రన్‌వే కింద నుంచి 600 మీటర్ల పొడవైన, ఆరు వరుసల అండర్‌పాస్ టన్నెల్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి త్వరలోనే అనుమతులు లభించే అవకాశం ఉంది.ఏఏఐ అనుమతి ఎప్పుడుఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే ఏఏఐ బోర్డు చర్చలు జరుపుతోంది. తాజా సమాచారం ప్రకారం, మరో రెండు వారాల్లో దీనికి గ్రీన్ సిగ్నల్ లభించే ఛాన్స్ ఉంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా , ఏఏఐ బృందాలు సంయుక్తంగా ఈ డిజైన్లను పరిశీలిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. దేశంలోనే మొదటిసారిగా ఒక రన్‌వే కింద ట్రాఫిక్ టన్నెల్ నిర్మించడం ఇదే కావడం విశేషం.రూ. 550 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్‌హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ప్యారడైజ్ నుంచి సుచిత్ర జంక్షన్ వరకు దాదాపు 5.5 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. దీని మొత్తం ఖర్చు సుమారు రూ. 550 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ కారిడార్‌లో భాగంగానే బేగంపేట రన్‌వే కింద టన్నెల్ రానుంది. దీనివల్ల ఉత్తర తెలంగాణ జిల్లాల వైపు వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది.తడ్బండ్ మలుపు వద్ద ఇబ్బందులు దూరంసాధారణంగా తడ్బండ్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ చేయడం చాలా కష్టతరంగా మారింది. అక్కడ మలుపులు ఎక్కువగా ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు అధికారులు బేగంపేట ఎయిర్‌పోర్ట్ కింద నుంచి నేరుగా టన్నెల్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ సొరంగ మార్గం అందుబాటులోకి వస్తే, వాహనాలు ఎక్కడా ఆగకుండా వేగంగా వెళ్లడానికి వీలవుతుంది. ఇప్పటికే ప్యారడైజ్ వద్ద నిర్మాణ పనులు మొదలయ్యాయి.రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంఈ ప్రాజెక్టును వచ్చే రెండేళ్లలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత రెండేళ్లుగా ఈ ప్రక్రియపై కసరత్తు జరుగుతోంది. ఇటీవల వారణాసి ఎయిర్‌పోర్ట్ కింద కూడా ఇలాంటి అండర్‌పాస్ నిర్మాణానికి అనుమతి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే బాటలో హైదరాబాద్ కూడా




నిలవబోతోంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే భాగ్యనగర మకుటంలో మరో మణిహారం చేరినట్టే, అలాగే వేలమంది వాహనదారులకు ట్రాఫిక్ నరకం నుంచి విముక్తి కలుగుతుంది.ఏదేమైనా రాబోయే రోజుల్లో భాగ్యనగర ప్రయాణం మరింత సుఖమయం కానుంది. ప్యారడైజ్ నుంచి సుచిత్ర వరకు ప్రయాణించే వారికి, ముఖ్యంగా సికింద్రాబాద్ వాసులకు ఈ ప్రాజెక్టు ఒక పెద్ద వరమనే చెప్పాలి. ప్రభుత్వం నిర్దేశించుకున్న రెండేళ్ల గడువులోగా ఈ పని పూర్తయితే, హైదరాబాద్ మౌలిక సదుపాయాల రంగంలో మరో సరికొత్త రికార్డు సృష్టించడం ఖాయం.

# హోర్ముజ్ జలసంధిపై కీలక నిర్ణయం

### ఊపిరి పీల్చుకోనున్న ఆయిల్ మార్కెట్!



ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఇరాన్ వార్ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ , ఇరాన్ మధ్య ముదురుతున్న పోరు ఇంధన మార్గాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయితే తాజాగా ఇరాక్ దేశానికి ఇరాన్ ఒక కీలక మినహాయింపునిచ్చినట్లు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా ఇరాక్ చమురు రవాణాపై ఉన్న పరిమితులను ఇరాన్ తొలగించిందనే నివేదికల నేపథ్యంలో ఇరాక్ తన ఖాతాదారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.24 గంటల్లోగా ప్లాన్ ఇవ్వాలి: సోమోఇరాక్ ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థ 'సోమో', తన కస్టమర్లందరూ రాబోయే 24 గంటల్లోగా ఆయిల్ లోడింగ్ ప్లాన్లను సమర్పించాలని కోరింది. చమురు ఎగుమతుల కొనసాగింపు , స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోమో స్పష్టం చేసింది. బాస్రా ఆయిల్ టెర్మినల్ సహా అన్ని లోడింగ్ పాయింట్లు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఎటువంటి ఆంక్షలు లేకుండా కాంట్రాక్టు ప్రకారం చమురు సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.పడిపోయిన ఉత్పత్తి.. పుంజుకునే అవకాశం!అమెరికా-ఇజ్రాయెల్ , ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఇరాక్ చమురు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం రోజుకు కేవలం 8 లక్షల బారెళ్ల ఉత్పత్తికి పడిపోయిన పరిస్థితి నుంచి మళ్లీ గట్టెక్కాలని ఇరాక్ భావిస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా రవాణాకు అనుమతి లభించడం వల్ల ఇరాక్ ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది.ట్రంప్ డెడ్ లైన్.. యుద్ధ నేరాలపై చర్చమరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం లోగా హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లు, వంతెనలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. అయితే ఈ హెచ్చరికలను డెమొక్రాటిక్ నాయకులు ఖండించారు. ఇవి యుద్ధ నేరాల కిందికి వస్తాయని మండిపడ్డారు. ఇరాన్ కూడా ట్రంప్ డెడ్ లైన్‌ను తోసిపుచ్చడమే కాకుండా అమెరికా దాడులు ఉధృతం చేస్తే హోర్ముజ్ జలసంధి అవతల ఉన్న అంతర్జాతీయ ఇంధన మార్గాలను కూడా ప్రమాదంలో పడేస్తామని హెచ్చరించింది.ఇరు దేశాల్లో ప్రాణనష్టం.. శాంతి చర్చల ప్రయత్నాలుఇరాన్‌లోని బహరెస్తాన్, టెహ్రాన్, కోమ్ ప్రాంతాల్లో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఆరుగురు పిల్లలతో సహా సుమారు 22 మంది మరణించినట్లు సమాచారం. దీనికి ప్రతీకారంగా ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలో ఒక భవనం కుప్పకూలి ఇద్దరు మరణించారు. అబుదాబి, కువైట్ వంటి ప్రాంతాల్లో కూడా క్షిపణి శకలాలు పడటంతో ఆందోళన నెలకొంది. ఈ ఉద్రిక్తతల మధ్య పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ మధ్యవర్తులు 45 రోజుల కాల్పుల విరమణ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.ఇరాన్ వార్ కారణంగా గ్లోబల్ ఆయిల్ మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. హోర్ముజ్ జలసంధి మూతపడితే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటడం ఖాయం. ప్రస్తుతం ఇరాక్ చేస్తున్న ప్రయత్నాలు కొంతవరకు సరఫరాను మెరుగుపరిచినా.. అమెరికా విధించిన మంగళవారం గడువు ముగిసిన తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారతాయేమోనన్న భయం ఇన్వెస్టర్లలో నెలకొంది. శాంతి చర్చలు సఫలమైతే తప్ప ఈ ఇంధన యుద్ధానికి ఇప్పట్లో తెరపడేలా కనిపించడం లేదు.

# బెంగళూరు ట్రాఫిక్ క్లియర్ కావాలంటే

### 25 అండర్పాసులు, 35 ఫ్లైవోర్స్, 101 స్కైవాక్స్ కావాల్సిందే..

బెంగళూరు నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని నియంత్రించడానికి, పాదచారుల భద్రతను మెరుగుపరచడానికి బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు సిద్ధం చేసిన సమగ్ర ప్రణాళిక నగర భవిష్యత్తుకు ఒక కీలక మార్గదర్శిగా కనిపిస్తోంది. రద్దీ డేటా, ప్రమాదాల విశ్లేషణ ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక, కేవలం రహదారుల విస్తరణపైనే కాకుండా, పాదచారుల ప్రాణ రక్షణపై కూడా దృష్టి సారించడం విశేషం. నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగడానికి 35 కొత్త ఫ్లైఓవర్లు, 25 అండర్‌పాస్‌లు అవసరమని దీూ గుర్తించింది. ఐటీ కారిడార్లైన వైట్‌ఫీల్డ్, మహాదేవపుర ప్రాంతాల్లోనే 24 ఫ్లైఓవర్లను ప్రతిపాదించారు. వర్తూర్ కోడి, గుంజూర్ వంటి జంక్షన్లలో పెరిగిన రద్దీని తగ్గించడం దీని ప్రధాన ఉద్దేశం.అలాగే హెబ్బాల్, ఇబ్లూర్, సరక్కి సర్కిల్ వంటి రద్దీ ప్రాంతాల్లో అండర్‌పాస్‌ల ద్వారా సిగ్నల్ రహిత ప్రయాణాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.గత మూడేళ్లలో పాదచారుల మరణాలు స్వల్పంగా తగ్గినప్పటికీ (2023లో 260 నుండి 2025లో 225కి), మౌలిక సదుపాయాల లోపం వల్ల ఇంకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిని అరికట్టడానికి 101 స్కైవాక్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా జాతీయ రహదారి 44, హోసూర్ రోడ్, ఓల్డ్ మద్రాస్ రోడ్ వంటి హైవేల వెంబడి పాదచారులు రోడ్డు దాటడం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతాల్లో స్కైవాక్‌ల నిర్మాణం మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలదు. బెంగళూరు మేక్రి సర్కిల్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్: రూ. 420 కోట్లతో భారీ ఫ్లైఓవర్! బెంగళూరు మేక్రి సర్కిల్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్: రూ. 420 కోట్లతో భారీ ఫ్లైఓవర్!ఈ ప్రతిపాదనలు కేవలం ప్రస్తుత అవసరాల కోసం మాత్రమే కాకుండా, భవిష్యత్తులో వాహనాల పెరుగుదలను (ప్రతిరోజూ దాదాపు 2,000 కొత్త వాహనాలు) పరిగణనలోకి తీసుకుని సిద్ధం చేశారు. ఎంఎస్ పాల్య వంటి ప్రాంతాల్లో జరిగిన 'కేస్ స్టడీ' ద్వారా ట్రాఫిక్ మళ్లింపులు మరియు ప్రత్యామ్నాయ మార్గాల ఆవశ్యకతను పోలీసులు శాస్త్రీయంగా నిరూపించారు.గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఈ నివేదికను ఐదు కొత్త కార్పొరేషన్లకు బదిలీ చేసింది. జంక్షన్ల మెరుగుదల, బస్ స్టాప్‌ల తరలింపు వంటి చిన్న పనులు ఇప్పటికే ప్రారంభం కావడం శు భపరిణామం. అయితే, ఫ్లైఓవర్లు మరియు అండర్‌పాస్‌ల వంటి దీర్ఘకాలిక ప్రాజెక్టులు సకాలంలో పూర్తయితేనే బెంగళూరు వాసులకు ట్రాఫిక్ నరకం నుండి విముక్తి లభిస్తుంది.బెంగళూరును కేవలం వాహనాల నగరంగానే కాకుండా, పాదచారులకు కూడా సురక్షితమైన నగరంగా మార్చాలనే దీూ సంకల్పం ప్రశంసనీయం. ఈ 170కి పైగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయితే, నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చే అవకాశం ఉంది.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# పిఎంఏవైజి లబ్ధిదారుల జాబితాకు గ్రామసభ ఆమోదం





**పొదలకూరు,జూన్29.అక్షర టైమ్స్:-రిపోర్టర్ ఆనంద్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి అవాస్ యోజన--గ్రామీణ పథకం కింద 2025 సంవత్సరానికి మొగళ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో అర్హులుగా గుర్తించిన 56 కుటుంబాల వివరాలను సోమవారం జరిగిన గ్రామసభలో చదివి వినిపించి, గ్రామసభ తీర్మానం ద్వారా ఆమోదించారు.ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల జాబితాను ప్రజల సమక్షంలో వెల్లడించి, అభ్యంతరాలు మరియు సూచనలను స్వీకరించారు. అనంతరం గ్రామసభ ఏకగ్రీవంగా జాబితాను ఆమోదించింది.అర్హులుగా ప్రతిపాదించిన కుటుంబాలలో ఎస్టీ కుటుంబాలు 7, ఎస్సీ కుటుంబాలు 26, ఇతర వర్గాలకు చెందిన కుటుంబాలు 23 ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మొగళ్లూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు మలిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం. నాగరాజు, వి.ఆర్.ఓ కె. రాజా, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎన్. కరుణతేజ్, మహిళా పోలీస్ ఆర్. అనిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్. మనోజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో గృహరహితులు మరియు అర్హులైన పేద కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణం కల్పించడమే ప్రధాన మంత్రి అవాస్ యోజన లక్ష్యమని అధికారులు తెలిపారు. గ్రామసభ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం పథకం అమలులో ప్రజల విశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

## అదిరిపోయే రేంజ్‌లో ఆరంభం



దేశవ్యాప్తంగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రాల్లో ఎన్టీఆర్ 'డ్రాగన్' ఒకటి. 'కేజీఎఫ్' ఫేం ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ఇండియా లెవల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ 50శాతం పూర్తయింది. ప్రస్తుతం ఎన్టీఆర్ ఎంట్రీ సీక్వెన్స్ కోసం భారీ సెట్ల నిర్మాణం జరుగుతున్నదని సమాచారం. ఈ సీక్వెన్స్‌లో తారక్ గెటప్ కొత్తగా ఉంటుందట. ఎన్టీఆర్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఈ లుక్‌ని ప్రశాంత్‌నీల్ డిజైన్ చేశారట. ఈ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్‌తో పాటు నలభైమంది ఫైటర్స్ కూడా భాగం కానున్నారట. ఈ సీక్వెన్స్‌తో షెడ్యూల్ పూర్తవుతుందని, ఓ పాట షూట్‌తో నెక్ట్స్ షెడ్యూల్ మొదలవుతుందని ఇన్‌సైడ్ టాక్. సాధారణంగా ప్రశాంత్‌నీల్ సినిమా ఫ్రేమ్స్ అన్నీ బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉంటాయి. కానీ ఈ సినిమాను మాత్రం ఆయన కలర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారట. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.

# వెంకటేశ్ అలా.. కల్యాణ్‌రామ్ ఇలా..

అగ్ర హీరోలు వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అనిల్ రావిపూడి నిర్మిస్తున్న మల్టీస్టారర్ మూవీ ఈ నెల 22న లాంఛనంగా మొదలైన విషయం తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్‌ని అనిల్ రావిపూడి స్టార్ట్ చేయనున్నారు. దీనికోసం ఇప్పటికే హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో భారీ సెట్‌ను కూడా నిర్మిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో వెంకటేష్, కల్యాణ్‌రామ్‌లపై కామెడీ సీన్స్‌తో పాటు ఓ పాటను కూడా షూట్ చేస్తారట. అంతేకాక, ప్రధాన తారాగణమంతా పాల్గొనగా కథలోని కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరిస్తారని వినికిడి.

ఈ సినిమాలో వెంకటేష్ అల్ట్రాస్టైలిష్ లుక్‌లో కనిపిస్తారట. ఆ లుక్‌కి పూర్తి భిన్నంగా కల్యాణ్‌రామ్ లుక్ ఉంటుందని సమాచారం. కుటుంబ భావోద్వేగాలు, కామెడీ ఎలిమెంట్స్ మేళవింపుగా ఈ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. నవంబర్‌లోపు షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తి చేసి సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని అనిల్ రావిపూడి భావిస్తున్నారు. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'జనవరి 13న విడుదల'అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే వార్తలొచ్చాయి. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీత దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మాత.



# దేశభక్తి నేపథ్యంలో



కొనంకి కార్తీక్ హీరోగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'సోల్జర్'. '24ఐ7 ఆన్ డ్యూటీ' అనేది ఉపశీర్షిక. శ్రద్ధ ఖత్రి దర్శకత్వంలో కేవీ నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. శక్తివంతమైన సైనికుడిగా కనిపిస్తున్న కొనంకి కార్తీక్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పోస్టర్‌లో కనిపిస్తున్న యుద్ధవాతావరణం, పోరాట ఛాయలు, రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకం సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. దేశ భద్రతకోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైనికులకు ఈ చిత్రం నివాళిగా నిలుస్తుందని, ఆద్యంతం దేశభక్తి నేపథ్యంలోనే ఈ సినిమా సాగుతుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రియాంక వర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బద్దుల, నిర్మాణం: కొనంకి ఎంటర్‌టైన్మెంట్స్.

## హృద్యమైన ప్రేమకథ



'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఏగన్, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ చిత్రం 'హైకూ'. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తిచేసుకుంది. కాలేజీ నేపథ్యంలో హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో సాగే చిత్రమిదని, యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. నేటి యువత మనోభావాలకు అద్దంపట్టే చిత్రమిదని, కథలోని కొత్తదనం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని నిర్మాతలు డి.అరుళానందు, మాథేవో అరుళానందు తెలిపారు. అదిర్చి అరుణ్, మైమ్ గోపి, ఇందుమతి, జెన్సన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రియేష్ గురుస్వామి, సంగీతం: సిద్ధుకుమార్, దర్శకత్వం: యువరాజ్ చిన్నసామి.

## 'స్టూడెంట్' మూవీ టీజర్ చూశారా?



దివంగత శ్రీహరి కొడుకు మేఘాంశ్ హీరోగా చేస్తున్న సినిమా 'స్టూడెంట్'. విజేత పరీక్ హీరోయిన్. బెల్లం సిద్ధారెడ్డి నిర్మిస్తున్నారు. బాలు తత్వమసి దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే తాజాగా టీజర్ రిలీజ్ చేశారు. దీనిబట్టి చూస్తే.. ఓ స్టూడెంట్ అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చి ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడనేది స్టోరీలా అనిపిస్తుంది. సరదాగా కాలేజ్ లైఫ్ ఎంజాయ్ చేసే స్టూడెంట్ భాను (మేఘాంశ్ శ్రీహరి).. ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ తరపున పాలిటిక్స్‌లోకి రావడం, అందులో ఉండే ప్రమాదాలను, ఎత్తులు పై ఎత్తులను త్వరగా అర్థం చేసుకోవడం లాంటివి చూపించారు. స్టూడెంట్, రాజకీయాల్లోకి వస్తే ఈ పొలిటికల్ ఆటను ఎలా మార్చేయగలడు అనేది సినిమాలో చూపించబోతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com